సోమవారం
08-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 48
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



పసిడి పంచ్‌లు

కామన్వెల్త్‌లో భారత్ జోరు

- బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ సహా ముగ్గురికి స్వర్ణ పతకాలు
- ట్రిపుల్ జంప్‌లో పసిడి, రజతం
- హాకీలో అమ్మాయిలకు కాంస్యం
- అథ్లెటిక్స్‌లో మరో రెండు
- ఫైనల్స్‌లో సింధు
- పురుషుల హాకీ ఫైనల్స్‌లో టీమిండియా

బర్మింగ్‌హామ్: బ్రిటన్‌లో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. తాజాగా మరో ఏడు పతకాలను కైవసం చేసుకుంది. బాక్సింగ్‌లో పురుషుల ఫ్లైవెయిట్‌లో అమిత్ పంగల్, మహిళల మినిమమ్ వెయిట్‌లో నీతూ గంఘాస్, ట్రిపుల్ జంప్ లో ఎల్డోస్ పాల్ అద్భుత ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకాలను చేజిక్కించుకున్నారు. మహిళల బాక్సింగ్ 48 కిలోల విభాగంలో పోటీపడిన నీతూ గంఘాస్ ఫైనల్లో ఇంగ్లండ్ కు చెందిన డెమీ జేడ్ రెస్టాన్‌పై పంచ్‌ల వర్షం కురిపించి, మొదటి రౌండ్‌ను 4-1 తేడాతో, రెండో రౌండ్‌లోనూ 4-1తేడాతో విజయం సాధించింది. అటు, పురుషుల బాక్సింగ్ 51 కిలోల విభాగంలో అమిత్ పంగల్ ఇంగ్లండ్‌కు చెందిన బాక్సర్ కైరన్ మెక్ డొనాల్డ్ పై మొదటి రౌండ్‌లో 5-0,రెండో రౌండ్‌లో 4-1 స్కోర్లతో గెలుపొందాడు. కాగా తెలంగాణ అమ్మాయి, ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్ 48-50 కేజీల (లైట్ ఫ్లై) విభాగంలో నార్తన్ ఐర్లాండ్‌కు చెందిన కార్లే మెక్‌న్యూయ్‌పై అద్భుత విజయం సాధించి పసిడి పతకం నెగ్గింది. క్వార్టర్స్‌లో వేల్స్ బాక్సర్ హెలెన్ జోన్స్‌పై 5-0 తేడాతో, సెమీస్‌లో ఇంగ్లాండ్ బాక్సర్ సావనా అల్ఫియాపై 5-0తో విజయం సాధించి ఫైనల్‌లోకి అడుగు పెట్టిన నిఖత్

- మిగతా 2 లో

దక్షిణాదిపై కమలం కన్ను

- తొలుత తెలంగాణపై దృష్టి
- టీడీపీతో మళ్లీ సఖ్యతకు యత్నం
- 2024 ఎన్నికల్లో మారనున్న రాజకీయ సమీకరణలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ అధిష్ఠానం దృష్టి సారిస్తోంది. మత అజెండానే కీలకంగా జనంలోకి చొప్పిస్తూ అత్యధికంగా ఉత్తరాది రాష్ట్రాల్లో అధికారం కైవసం చేసుకున్న బీజేపీ, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం బలపడలేకపోతోంది. కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ దక్షిణాదిలో ఒక్క కర్ణాటక మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ బీజేపీ పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడిలాగే ఉంది. తమిళనాడు, ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండగా, కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లోనైనా దక్షిణాది రాష్ట్రాలపై కొంత పట్టు సాధించాలని కమలనాథులు ఆరాటపడుతున్నారు. ఇందుకోసం ఇప్పటినుంచే వ్యూహాలు రచిస్తున్నారు. దీనిలోభాగంగా తొలుత తెలంగాణపై దృష్టి పెడితే అధికారంలోకి రావడానికి అవకాశాలున్నాయని ఆ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఒక అంచనాకు వచ్చింది. హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు సాధించడం, ఇటీవల టీఆర్ఎస్ నుంచి బైటకొచ్చిన ఈటల రాజేందర్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించడం, గత పార్లమెంటు ఎన్నికల్లో ముగ్గురు ఎంపీలు గెలవడంతో పాటు, మరో ఇద్దరు అతి తక్కువ ఓట్ల తేడాతో ఓటమి చెందిన పరిస్థితులను కమలనాథులు విశ్లేషించుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 45 నియోజకవర్గాల్లో బీజేపీ బలంగా ఉందని, మరో 20 నియోజకవర్గాలపై దృష్టి పెడితే అధికారంలోకి రావడం పెద్ద కష్టం కాదని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. అయితే ఈ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడానికి అవసరమైన ఓటు బ్యాంకుపై ఇప్పుడు నేతలు దృష్టి పెట్టారు. ప్రస్తుతం తెలంగాణలో టీఆర్ఎస్ మరలా అధికారాన్ని చేజిక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలని తపన పడుతుండగా, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని ఈసారి ఎలాగైనా అధికారంలోకి తీసుకురావాలన్న ధ్యేయంతో గట్టి ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇటీవల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల తెలంగాణ వైఎస్సార్ పార్టీ స్థాపించి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర

- మిగతా 2 లో

అద్భుత పథకాలు అమలు

- నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం జగన్ స్వోత్కర్ష
- ఏపీలో 62 శాతం జనాభా వ్యవసాయ ఆధారమే
- అందుకే దానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం
- విద్యారంగంలో అనేక సంస్కరణలు
- సూచనలు, సమస్యలు ప్రస్తావించని వైనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దేశ రాజధానిలో ఆదివారం రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో సీఎం జగన్ విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన కీలక సమస్యలు ప్రస్తావించడం, మరోవైపు నీతి ఆయోగ్ సమావేశ లక్ష్యానికి అనుగుణంగా అవసరమైన విలువైన సలహాలు, సూచనలు ఇవ్వకుండా ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి ఒక మంచి అవకాశాన్ని జారవిడిచారని ప్రతిపక్షాలతో పాటు అధికార పార్టీ నేతలు సైతం విమర్శిస్తున్నారు. ఫలితం గురించి విశ్లేషించకుండా, కొత్త పథకం అమలు చేయడమే గొప్ప అన్న విధంగా సీఎం తాను విద్యా, వ్యవసాయ రంగాల్లో అమలు చేస్తున్న పథకాలను వివరించి రాష్ట్ర ప్రజలను నిరుత్సాహపరిచారు. రాష్ట్రానికి సంబంధించిన ఒక్క సమస్యనూ ఆయన ప్రస్తావించలేకపోయారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, నూనె, పప్పు పంటల సాగులో స్వయం సమృద్ధి, జాతీయ విద్యా విధానం అమలు, పట్టణాభివృద్ధి, వివిధ రంగాల్లో ఆత్మ నిర్భర్ సాధించేందుకు కేంద్ర, రాష్ట్రాల మధ్య సహకారంపై ఈ సమావేశంలో చర్చించగా, ఏపీలో

- మిగతా 2 లో

రాష్ట్రాలకు పన్నుల
వాటా పెంచండి..

నీతిఆయోగ్ పాలక మండలి సమావేశంలో సీఎంల డిమాండ్

కేసీఆర్, నితీశ్ కుమార్ గైర్హాజరు

న్యూఢిల్లీ: రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా పెంచాలని నీతిఆయోగ్ ఏడవ పాలకమండలి సమావేశంలో కొందరు ముఖ్యమంత్రులు డిమాండు చేశారు. చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ మాట్లాడుతూ, కేంద్ర పన్నులు, సుంకాలలో రాష్ట్ర వాటాను పెంచాలని, తమ వనరులపై భారం పడుతోందని అన్నారు. జీఎస్టీ పరిహారం విషయంలో కొత్త పన్ను విధానం కారణంలో ఆదాయ లోటును ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. 20,000 కంటే తక్కువ జనాభా ఉన్న నగరాల సమీప గ్రామాల్లోనూ గ్రామీణ

- మిగతా 2 లో

అయోధ్య 'భూ దందా'లో
కాషాయ నేతలు

- నగర మేయర్, బీజేపీ స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే
- 40 మంది పేర్లు వెల్లడించిన అభివృద్ధి మండలి
- సీఎం యోగికి ఎంపీ లల్లూ సింగ్ ఫిర్యాదు

అయోధ్య : అయోధ్యలో అక్రమంగా భూముల కొనుగోలు, అమ్మకాల్లో కాషాయ నేతల పాత్ర కలకలం రేపుతోంది. అయోధ్య అభివృద్ధి మండలి అక్రమంగా ప్లాట్లు వ్యాపారం చేసి, అటువంటి భూమిలో మౌలిక సదుపాయాలను నిర్మించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందిలో అయోధ్య ఎమ్మెల్యే వేద్ ప్రకాష్ గుప్తా, అయోధ్య మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రిషికేశ్ ఉపాధ్యాయ, మిల్కీపూర్‌కు చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే బాబా గోరఖ్‌నాథ్ పేర్లు ఉన్నాయి. ఈ విషయంపై బీజేపీపై విమర్శలు గుప్పించిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, కాషాయ పార్టీ 'భ్రష్టాచారి' (అవినీతిపరులు) కనీసం అయోధ్యను విడిచిపెట్టాలని అన్నారు. అయితే, మేయర్ రిషికేశ్ ఉపాధ్యాయ,

- మిగతా 2 లో

నేడు పోలవరంపై సీపీఐ రౌండ్‌టేబుల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రానికి అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నార్థకంగా మార్చిన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు, రైతు, ప్రజాసంఘాలతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల 8న విజయవాడ

- మిగతా 2 లో

బంగాళాఖాతంలో అల్పపీడనం

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలో భారీ వర్షాలు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

8 లో

సీఎస్ఐఆర్ తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నల్లతంబి కలైసెల్వి

8లో

ఇదీ లోకం!

ఎక్కడ ఎగర వేయమంటారు సామీ!?

అనుకున్న ఫలితాలివ్వలేదు

- ఎస్ఎస్ఎల్‌వీ-డీ1లో సాంకేతిక సమస్య
- తప్పుడు కక్ష్యలోకి ఉపగ్రహాల ప్రవేశం
- అందని సిగ్నల్స్- డేటా నష్టం
- శాటిలైట్లు ఇక పనికిరావు : ఇస్రో

విశాలాంధ్ర-సూళ్లూరుపేట / శ్రీహరికోట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఎస్ఎల్‌వీ-డీ1 మిషన్ అనుకున్న ఫలితాన్ని ఇవ్వలేదు. ప్రయోగం మూడు దశల్లో విజయవంతం అయిందిగానీ నాలుగో దశలో సాంకేతిక సమస్య తలెత్తింది. అది ఉద్దేశించిన గమ్యాన్ని చేరుకోలేకపోయింది. వృత్తాకార (సర్క్యులర్) కక్ష్యలోకి ప్రవేశపెట్టాల్సిన ఉపగ్రహాలను దీర్ఘవృత్తాకార (ఎలిప్టికల్) కక్షలోకి ఎస్ఎస్ఎల్‌వీ-డీ1 ప్రవేశపెట్టింది. ఈ కారణంగా ఆ ఉపగ్రహాలు పనికిరాకుండా పోయాయని ఇస్రో తెలిపింది. కొత్తగా అభివృద్ధి చేసిన చిన్న ఉపగ్రహాల వాహన నౌక (ఎస్ఎస్ఎల్‌వీ)ను ఆదివారం ఉదయం 9.18 గంటలకు తిరుపతి జిల్లా, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించారు. ఎస్ఎస్ఎల్‌వీ నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం మూడు దశల్లో విజయవంతం అయిందిగానీ నాలుగో దశ

- మిగతా 2 లో

మా "మార్గదర్శి"కి అశ్రునివాళి

గత 44 సంవత్సరాలుగా, యెండ్లూరు గ్రామ సర్పంచ్‌గా ప్రత్యక్షంగా, పరోక్షంగా గ్రామ అభివృద్ధికి విశేష సేవలందించి గ్రామ ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించి, మా కుటుంబ ఉన్నతికి తన జీవితాంతం శ్రమించి, మా జీవితాలలో వెలుగులు నింపి మాకు మార్గదర్శకులుగా నిలిచిన కీ॥శే॥ బొమ్మినేని వెంకట నరశింహారావు గారి మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ బొమ్మినేని వెంకట నరశింహారావు గారు
మాజీ సర్పంచ్: (1969-1995) యెండ్లూరు, ఎస్.ఎన్.పాడు (మం)
జననం:9-8-1933 మరణం: 26-7-2022

కుమారుడు- కోడలు: బొమ్మినేని రామాంజనేయులు - శ్రీహరిదేవి
MD: BR Infracon
మనుమలు:
బొమ్మినేని అశోకచక్రవర్తి - శ్వేత
MD: Reloto Automation Solutions
MD: సిస్టార్ టెక్ & స్పింక్లర్స్
బొమ్మినేని అంకమ్మచౌదరి- మౌనిక
MD: భగీరథ పాలిమర్స్
మనుమరాలు: లెక్కల సంగీతలక్ష్మి- వినీత్ MD:Srida Industries
మునిమనుమరాండ్రు: లెక్కల అన్విక పల్లవి, బొమ్మినేని అక్ష
కుమార్తె- అల్లుడు: శిరిపురపు లలిత - చెంచురామయ్య
మనుమడు: శిరిపురపు అనంతక్రిష్ణ - సరస్వతి
మనుమరాలు: నల్లూరి లక్ష్మీ ప్రసన్న- సుబ్బానాయుడు
మునిమనుమలు: నల్లూరి సుజిత్, శిరిపురపు ఇషాంత్
మునిమనుమరాండ్రు: నల్లూరి వర్షిణి, శిరిపురపు తేష్న
కుమారుని వియ్యంకులు- వియ్యపురాండ్రు
రాళ్ళపల్లి అనంతయ్య- పార్వతి యలవర్తి శ్రీనివాసరావు - కనకదుర్గ
లెక్కల చిట్టిబాబు - యామిని

పెద్దకర్మ: తేది 8-8-2022 సోమవారం ఎస్.ఎన్.పాడు మండలం యెండ్లూరు గ్రామంలోని మా స్వగృహం నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

24కు పెరిగిన మృతులు

ఇజ్రాయిల్-పలస్తీనాలో యుద్ధ వాతావరణం

గాజా : ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య మరోమారు ఘర్షణ చోటుచేసుకుంది. శుక్రవారం గాజాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరుపగా మృతుల సంఖ్య ఆదివారానికి 24కు పెరిగింది. మరణించిన వారిలో ఆరుగురు చిన్నారులు ఉన్నట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. గాజాతో పాటు అనేక నగరాలపై బాంబుల వర్షాన్ని ఇజ్రాయిల్ కురిపించినట్లు అధికారులు వెల్లడించారు. పలస్తీనా ఇస్లామిక్ జిహార్ ఉగ్రసంస్థ సీనియర్ కమాండర్‌ను ఇజ్రాయిల్ మట్టుబెట్టిన క్రమంలో ఈ ఘర్షణ మొదలు అయింది. ఇప్పటివరకు హమాస్ ఆచితూచి వ్యవహరించారు. ఏడాది కిందట కూడా ఈ రెండు వర్గాల మధ్య భీకర యుద్ధం జరిగింది. 15ఏళ్లలో అనేక చిన్న యుద్ధాలు జరిగాయి. పలస్తీనా తీవ్రవాదులు శనివారం అర్ధరాత్రి జరిపిన రాకెట్ దాడిలో ఉత్తర గాజాలోని జాబాలియా పట్టణంలో చిన్నారులతో పాటు పౌరులు మరణించినట్లు ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. దర్యాప్తు జరిపించగా ఇస్లామిక్ జిహాద్ తరపు నుంచి పొరపాటు జరిగినట్లు వెల్లడి అయిందని తెలిపింది. ఈ ఘటనపై పలస్తీనా వైపు నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

కొలంబియాకు తొలి వామపక్ష అధ్యక్షుడు

గుస్తావో పెట్రో ప్రమాణ స్వీకారం

బొగొటా : కొలంబియాకు మొట్టమొదటి వామపక్ష అధ్యక్షుడిగా గుస్తావో పెట్రో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్థిక అసమానతలు, డ్రగ్స్ హింసతో సతమతమవుతున్న దేశంలో అనేక సంస్కరణలను చెపట్టనున్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సెనేట్ అధ్యక్షుడు రాయ్ బర్రేరాస్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి 1,00,000 మంది హాజరైనట్లు సమాచారం. స్పెయిన్ రాజు ఫిలిప్ 6, తొమ్మిది లాటిన్ అమెరికా దేశాల అధ్యక్షుడు, కొలంబియా ప్రముఖులను పెట్రో ఆహ్వానించారు. తొలి ఆఫ్రో-కొలంబియా మహిళ నూతన ఉపాధ్యక్షురాలిగా ఫ్రాంసియా మార్కెజ్ (40) బాధ్యతలు చేపట్టారు. పెట్రో(62) మాజీ సెనేటర్, గెరిల్లా ఎం17 దళ సభ్యుడు. దేశంలో 50 మిలియన్లు (ఐదు కోట్ల మంది) ఆకలిని తీర్చేందుకు కృషిచేస్తానని పెట్రో చెప్పారు. 5.8 బిలియన్ డాలర్ల పన్ను సంస్కరణలను సంకల్పించారు. సామాజిక కార్యక్రమాలకు నిధుల కోసం సంపన్నులపై సుంకాలు పెంచే ప్రతిపాదనను కాంగ్రెస్ ముందర సోమవారం కొత్త ఆర్థిక మంత్రి జోసే ఆంటోనియో ఓకాంపో ఉంచనున్నారు. అధ్యక్షుడి బాధ్యతలు చేపట్టేందుకు ఆందోళనగానే ఉందని ఇటీవల బొగొటోలోని ఆల్మామ్యాటర్ ఎక్స్‌టర్నాడో యూనివర్సిటీ విద్యార్థులతో మాట్లాడిన పెట్రో అన్నారు. ఉచిత యూనివర్సిటీ విద్యకు, ఆరోగ్య సంరక్షణ రంగంలో మార్పులకు హామీనిచ్చారు. పింఛన్ సంస్కరణలు చేపడతానని అన్నారు. కొత్త చమురు అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేస్తానని చెప్పారు. ఈయన గతంలో బొగొటా మేయర్‌గానూ పనిచేశారు. నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఈఎన్ఎన్) రెబల్స్‌తో శాంతి చర్చలను పునరుద్ధరిస్తానని హామీనిచ్చారు. అలాగే, 2016శాతం ఒప్పందానికి అర్థీ పెడతానన్నారు. జూన్‌లో జరిగిన ఎన్నికల్లో గుస్తావో పెట్రో కష్టపడి గెలిచారు. చాలా కాలంగా ఈ దేశంలో కన్జర్వేటివ్ పరిపాలన ఉంది. శతాబ్దాలుగా శాంతికి నోచుకోని కొలంబియాలో శాంతి స్థాపనకు తమ ప్రభుత్వం కృషిచేస్తుందని పెట్రో ఉద్ఘాటించారు. పర్యావరణ న్యాయం కోసం పోరాడుతుందని ఆయన స్పష్టంచేశారు.

మొదటి ఆఫ్రో-కొలంబియా ఉపాధ్యక్షురాలిగా మార్కెజ్

కాబూల్‌లో మళ్లీ పేలుళ్లు: 8 మంది మృతి

కాబూల్: అఫ్గాన్ రాజధాని కాబూల్ మరోమారు పేలుళ్లతో దద్దరిల్లింది. శుక్రవారం జరిగిన దాడి నుంచి కోలుకోక ముందే శనివారం అత్యంత రద్దీగా ఉండే షాపింగ్ స్ట్రీట్‌లో బాంబు పేలింది. తాజా ఘటనలో ఎనిమిది మంది మరణించారు. 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని పశ్చిమ జిల్లాలో పేలుడు సంభవించినట్లు అధికారులు చెప్పారు. ఇక్కడ షియా వర్గీయులూ తరచూ భేటీ అవుతూ ఉంటారు. ఈ దాడికి తమదే బాధ్యత అని ఇస్లామిక్ స్టేట్, సున్నీ ఉగ్రసంస్థ టెలిగ్రామ్ ద్వారా ప్రకటించింది. మృతుల సంఖ్య పెరగవచ్చు అని ప్రైవేటు ఆసుపత్రి సీనియర్ వైద్యాధికారి తెలిపారు. అంతర్గత శాఖ అధికార ప్రతినిధి స్పందిస్తూ దర్యాప్తు బృందం ఘటన స్థలానికి వెళ్లి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తోందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఈ దాడికి సంబంధించి వీడియోలు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టాయి. అంబులెన్సులు ఘటనాస్థలానికి చేరుకోవడం, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్మేసి ఉండటం కనిపిస్తోంది. శుక్రవారం దాడిలో ఎనిమిది మంది చనిపోగా 18 మంది గాయపడ్డారు. అఫ్గాన్‌లో ఐఎస్ నియంత్రణ లేనప్పటికీ స్లీపర్ సెల్స్ ఉన్నారు. వారి సాయంతో దాడులు చేస్తుంటుంది.

అమెరికాలో పేలిన తుపాకీ : నలుగురి కాల్చివేత

ఒహాయో : అమెరికాలో మరోమారు తుపాకీ పేలింది. నలుగురిని పొట్టన పెట్టుకుంది. ఒహాయోలో ఈ ఘటన చోటుచేసుకుంది. డేటన్లోని బట్లర్ టౌన్‌షిప్‌లో ఓ వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులు జరుపగా నలుగురు మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. నిందితుడు శుక్రవారం మధ్యాహ్నం నుంచి కారులో షికారు చేస్తూ వివిధ ప్రాంతాల్లో కాల్పులకు తెగబడినట్లు వెల్లడించారు. పోలీసు బృందాలు దుండగుడి కోసం గాలిస్తున్నాయి. అతనిని 39 ఏళ్ల స్టీఫెన్ మార్లోగా గుర్తించాయి. అతను కనిపిస్తే దగ్గరకు వెళ్ల వద్ద, వెంటనే పోలీసులకు లేదా ఎఫ్‌బీఐకి సమాచారం ఇవ్వాలని పౌరులకు అధికారులు సూచించారు. అతని ఫొటో, కారు ఫొటోను విడుదల చేశారు. మార్లో నేరచరితుడని, కొన్ని కేసుల్లో శిక్ష అనుభవించాడని పోలీసులు తెలిపారు.

అనుకున్న ఫలితాలివ్వలేదు

(మొదటిపేజీ తరువాయి)

అనుకున్నట్లుగా సాగలేదు. చిన్న ఉపగ్రహం దారి మళ్లింది. ఈ తాజా పరిణామంపై సంబంధిత కమిటీ సమీక్షించి, తదనుగుణంగా సిఫార్సులు చేస్తుందని, వాటి ఆధారంగా ఎస్ఎస్ఎల్‌వీ-డీ2ను సిద్ధం చేస్తామని ఇస్రో తెలిపింది. టెర్మినల్ దశలో డేటా నష్టాన్ని (సమాచారం కోల్పోవడం) ఎదుర్కొందని, ఉపగ్రహాలకు సంబంధించి డేటా శాస్త్రవేత్తలకు లభించలేదని ఇందుకోసం శాస్త్రవేత్తలు అన్వేషిస్తున్నారని వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగా ఉపగ్రహాల నుంచి కంట్రోల్ సెంటర్‌కు సిగ్నల్స్ అందలేదని ఇస్రో తెలిపింది. ఇస్రో చైర్మన్ డా.సోమనాథ్ మాట్లాడుతూ, ఉపగ్రహాల నుంచి డేటా కోల్పోయినట్లు తెలిపారు. మూడవ దశలు సక్రమంగా పూర్తి కాగా టెర్మినల్ దశలో కొంత డేటా నష్టం జరగిందని, దానిని విశ్లేషిస్తున్నామని చెప్పారు. లాంచ్ వెహికల్ పనితీరుతో పాటు ఉపగ్రహాల స్థితి గురించి త్వరలో పూర్తి సమాచారం ఇస్తామన్నారు.ఆజాదీ శాట్ తన నిర్ణీత కక్ష్య నుంచి పక్కకు వెళ్లినట్టుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈఓఎస్-02 నిర్ణీత కక్ష్యలోనే శాస్త్రవేత్తలు ఉందన్నారు. అవి సిగ్నల్స్ పంపడం లేదని, రాకెట్ గమనాన్ని గమనిస్తున్నామని తెలిపారు. కాగా, ఇస్రో ఇప్పటివరకు చిన్న, మధ్యస్థ, ఓ మోస్తరు బరువైన ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారానే కక్ష్యలోకి పంపేది. దీన్ని తయారు చేసేందుకు 600 మంది 70 రోజులు శ్రమించాల్సి వచ్చేది. చిన్న ఉపగ్రహ వాహకనౌక తయారీకిగాను ఆరుగురు శాస్త్రవేత్తలు 72 గంటలు కష్టపడ్డారు. ఇందుకోసం రూ.30 కోట్లు ఖర్చు అయింది. 500 కిలోల వరకు బరువున్న వాణిజ్య ఉపగ్రహాలను సమీప భూకక్ష్యలో ప్రవేశపెట్టగలదు. ఇది అంతరిక్ష రంగం, ప్రైవేటు భారతీయ పరిశ్రమల మధ్య మరింత సహకారాన్ని సృష్టించనుంది. మొదటి ప్రయోగం నిరుత్సాహపర్చడం ఇస్రోకు కొత్త కాదు. పీఎస్ఎల్‌వీ-1 ప్రయోగం సమయంలోనూ ఇలాగే జరిగింది. 1994లో దానిని విజయవంతంగా ప్రయోగించింది. 2017 జూన్‌కి 39 మిషన్లను విజయవంతంగా చేపట్టింది. 2008లో చంద్రయాన్ 1, 2013లో మార్స్ ఆర్బిటర్‌ను ప్రయోగించి విజయాలను ఇస్రో అందుకుంది.

నేడు పోలవరంపై సీపీఐ రౌండ్‌టేబుల్

(మొదటిపేజీ తరువాయి)

నగరంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి ఒక ప్రకటనలో తెలిపింది. దాసరి నాగభూషణరావు భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం కేంద్ర నాయకులు పి.మధు, టీడీపీ మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, జ్యోతుల నెహ్రూ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు చందా లింగయ్య, పోలవరం నిర్వాసితులు, గిరిజన, రైతు సంఘాల నేతలు హాజరవుతారు. ఈ సమావేశానికి వ్యవసాయ, సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి అవగాహన కలిగిన ముఖ్యులంతా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ కోరింది.

కాషాయ నేతలు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే వేద్ ప్రకాష్ గుప్తా నిర్దోషులని పేర్కొన్నారు. అయోధ్య అభివృద్ధి మండలి విడుదల చేసిన ఆరోపించిన నేరస్థుల జాబితాలో కపట నాటకం ఉందని ఆరోపించారు. అభివృద్ధి మండలి ప్రాంతంలో అక్రమంగా భూములు కొనుగోలు చేసి, విక్రయించి, నిర్మాణ పనులు చేపట్టిన 40 మంది జాబితాను శనివారం రాత్రి విడుదల చేసినట్లు మండలి వైస్ చైర్మన్ విశాల్ సింగ్ ఆదివారం పీటీఐకి తెలిపారు. జాబితా జారీ చేయడం ద్వారా ప్రజలకు నోటీసులు జారీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సింగ్ తెలిపారు. మొత్తం 40 మందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉపాధ్యాయ్, గుప్తా కుట్ర చేశారని, తమను ఈ కేసులో తప్పుగా ఇరికించారని ఆరోపించారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని ప్రత్యర్థి పార్టీలు అయోధ్యలో అక్రమంగా భూముల కొనుగోలు, అమ్మకాల అంశాన్ని లేవనెత్తాయి. ఈ వ్యవహారం పై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీ లల్లూ సింగ్... ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాశారు. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ హిందీలో చేసిన ట్వీట్‌లో, 'మేము ఇంతకు ముందు చెప్పాము. మళ్లీ పునరావృతం చేస్తున్నాము. బీజేపీ అవినీతిపరులు, కనీసం అయోధ్యను విడిచిపెట్టండి' అని యాదవ్ తన ఆరోపణకు మద్దతుగా మీడియా నివేదికను కూడా ట్యాగ్ చేశారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన పార్టీ డిమాండ్ చేసింది. 'అయోధ్యలో బీజేపీకి చెందిన మేయర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే భూ మాఫియాతో కలిసి అక్రమ కాలనీలు ఏర్పాటు చేస్తున్నారు. బాధ్యతాయుతమైన శాఖలతో కుమ్మక్కై 30 అక్రమ కాలనీలు ఏర్పాటు చేసి రాష్ట్ర ఆదాయానికి వందల కోట్ల మేర నష్టం వాటిల్లుతోంది. అనే విషయంపై విచారణ జరపాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి' అని సమాజ్‌వాది పార్టీ తన అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌లో పేర్కొంది.

భూ మాఫియా ఇలా...!

అయోధ్యలో సరయూ నది ఒడ్డున ఉన్న ప్రభుత్వ నాజుల్, గ్రామీణ ప్రాంతాల భూముల్లో ఎక్కువ భాగం ప్రభుత్వ అధికారుల అండతో ఆస్తి వ్యాపారులు పెద్ద ఎత్తున విక్రయించారు. ఈ వ్యాపారంలో ఎలాంటి ప్రమాణాలు పాటించలేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని, అయోధ్య అభివృద్ధి మండలి అక్రమంగా భూమిని కొనుగోలు చేసిన, విక్రయించిన, ప్లాట్లు చేసిన 40 మంది ఆస్తుల వ్యాపారుల జాబితాను విడుదల చేసింది. ఈ ఆస్తుల డీలర్ల జాబితాలో అయోధ్య సదర్ ఎమ్మెల్యే వేద్ ప్రకాశ్ గుప్తా, మేయర్ రిషికేశ్ ఉపాధ్యాయ, మిల్కీపూర్ మాజీ ఎమ్మెల్యే గోరఖ్‌నాథ్ బాబా పేర్లు కూడా ఉన్నాయి. అభివృద్ధి మండలి ఈ జాబితాను విడుదల చేయడంతో కలకలం రేగింది. ఇప్పుడు అధికారపక్షాన్ని చుట్టుముట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఫైజాబాద్ నగరంలోని తీర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూములు ప్లాట్లు చేసి విక్రయించారు. అక్కడ అక్రమంగా కాలనీలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రజలు భూములు కొని ఇళ్లు కట్టుకున్నారు. అయితే గత 15 రోజుల క్రితం ఆ ప్రాంతాన్ని ముంపు ప్రాంతంగా అభివృద్ధి అధికార యంత్రాంగం ప్రకటించడం, బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయడం కలకలం రేపింది. అనంతరం విచారణ ప్రారంభించగా ఈ ప్రాంతంలో వారు ఇళ్లు కట్టుకొని ఉన్నట్లు తెలిసింది.

ప్రభుత్వ శాఖ ద్వారా తొలగింపు చర్యను చేపట్టాయి. నగరపాలక సంస్థ నుంచి ఇంటి నంబర్‌ను మంజూరు చేసినట్లు తెలిసింది. అటువంటి పరిస్థితిలో ఈ భూ యజమానులు తమకు భూమిని స్వాధీనం చేసుకుని ఇల్లు నిర్మించుకునే హక్కు వచ్చినప్పుడు, తమ భూమి, ఇల్లు అక్రమమని ఎలా ప్రకటించారని వాదిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై దుమారం చెలరేగడంతో ప్రభుత్వం, పాలనా యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి.

రాష్ట్రాలకు పన్నుల వాటా పెంచండి..

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ, కేంద్ర పథకాల అమలులో రాష్ట్రాలు, కేంద్రం మధ్య వివాదాలను పరిష్కరించాలని అంబుడ్స్‌మన్‌గా నీతి ఆయోగ్ ఉండాలని కోరారు. టెలికం, రైల్వే, బ్యాంకింగ్ వంటి కేంద్ర జాబితాలో ఉన్న అంశాల్లో ఒడిశాకు అన్యాయం జరుగుతోందన్నారు. ఒడిశాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా కొన్ని సమస్యలపై చర్చించారు. సుస్థిర సమ్మిళిత భారత నిర్మాణమే లక్ష్యంగా నీతి ఆయోగ్ పాలక మండలి దిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగింది. పంటలు, నూనెగింజల పప్పు ధాన్యాలు, వ్యవసాయ-సంఘాల వైవిధ్యం విషయంలో స్వావలంబన సాధించడంతో పాటు జాతీయ విద్యా విధానం అమలు తదితర అంశాలను చర్చించింది.

అన్ని రంగాల్లో స్వాలంభనకు కృషిచేద్దాం: ప్రధాని పిలుపు

స్వీయసమృద్ధి భారతాన్ని ప్రధాని మోదీ ఆకాంక్షిస్తున్నారు. వ్యవసాయ రంగంలో విశ్వగురువు కావాలని కోరుకుంటున్నారు. ఈ విషయాలను ఆయన నీతిఆయోగ్ పాలకమండలి సమావేశంలో చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించాలని, విస్తృత పట్టణీకరణ భారత్‌కు బలం కావాలేగానీ బలహీనత కాదని నొక్కిచెప్పారు. అన్ని రంగాల్లో స్వావలంభన సాధనకు ఐక్యంగా కృషిచేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా జీవన నాణ్యత మెరుగవ్వాలని, జీవనం సులభం కావాలని, సేవ ల్లో పారదర్శకత రావాలని అన్నారు. వంట నూనె ఉత్పత్తిలో భారత్ స్వీయ సమృద్ధి సాధించాల న్నారు. 2023లో భారత్‌కు జీ20 అధ్యక్ష బాధ్యత లు లభించడాన్ని ప్రస్తావించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని; తద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందేలా జీ20కి నిబద్ధగల బృందాలను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు సూచించారు. సహకార సమాఖ్యవాదాన్ని కూడా కొనియాడారు. రాష్ట్రాల కృషి వల్లే భరత్ కోవిడ్‌ను కట్టడి చేయగలిగిందన్నారు. గట్టి పట్టుదల, స్థితి స్థాపన ఉంటే పరిమిత వనరులతోనే సవాళ్లను అధిగమించచ్చు అన్న సందేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత్ ఇచ్చిందని మోదీ అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ భారత్‌ను విశ్వగురువుగా భావిస్తున్నాయని చెప్పారు. '75ఏళ్ల స్వతంత్ర భారతంలో అని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఒకచోట సమావేశం అయి దేశానికి కీలకమైన అంశాలపై మూడు రోజులు పాటు చర్చలు జరపడం ఇదే మొదటిసారి. సంయుక్త ప్రక్రియ ద్వారానే సమా వేశ అజెండా రూపొందిందని చెప్పారు. మూడు టీలు.. వర్తకం, పర్యాటకం, సాంకేతిక పరిజ్ఞానం (ట్రేడ్, టూరిజం, టెక్నాలజీ)లను భారతీయ మిషన్‌ల ద్వారా ప్రపంచమంతటా రాష్ట్రాలు ప్రచారం చేయాలని మోదీ పిలుపునిచ్చారు. దిగుమతులను తగ్గించుకొని ఎగుమతులను పెంచడంపై దృష్టి పెట్టాలని, అవకాశాలను పెంచుకోవాలని సూచించారు. స్థానిక వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, 'వోకల్ టు లోకల్' కేవలం ఒక రాజకీయ పార్టీ అజెండా కాదు ఉమ్మడి లక్ష్యం అని మోదీ అన్నారు. జీఎస్టీ వసూళ్లు పెరగాలంటే కేంద్రం-రాష్ట్రాలు ఉమ్మడిగా కృషి చేయాలన్నారు. ఆర్థికంగా బలపడేందుకు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలిచేందుకు ఇది కీలకమని చెప్పారు. సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాల సమస్యలు, సూచనలను నీతిఆయోగ్ పరిశీలిస్తుందని, ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న ప్రణాళికలతో వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు రాబోయే 25ఏళ్లలో దేశ ప్రాధాన్యతలను నిర్వచిస్తాయని అన్నారు. నేడు వేసిన విత్తనాలు 2047లో భారత్‌కు ఫలాలిస్తాయని మోదీ ఆకాంక్షించారు. కాగా, జీ20కి అధ్యక్షత వహించే అవకాశం భారత్‌కు లభించడం చరిత్రాత్మకమని, ఏడాది పాటు జీ20 సమావేశాలను భారత్ నిర్వహిస్తుందని, ఒక్క దిల్లీలోనే కాదు ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇవి జరుగుతాయని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ అన్నారు. భారత్‌లో సంస్కరణలు రాష్ట్ర స్థాయిలోనే జరగాలని నీతిఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరి నొక్కిచెప్పారు. మహమ్మారి తర్వాత భారత్ శక్తిమంతంగా ఉండాలన్న విజన్ దిశగా కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఇదిలావుంటే, 2019 తర్వాత నీతి అయోగ్ సమావేశం ప్రత్యక్షంగా జరగడం ఇదే మొదటిసారి. సమావేశానికి తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్ రావు, బీహార్ సీఎం నితీశ్ కుమార్ మినహా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ముగ్గురు లెఫ్టినెంట్ గవర్నర్లు, ఇద్దరు అడ్మినిస్ట్రేటర్లతో పాటు కేంద్రమంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్, ఎస్‌జైశంకర్ పాల్గొన్నారు.

దక్షిణాదిపై 'కమలం' కన్ను

(మొదటిపేజీ తరువాయి)

చేస్తుండడంతో, కాంగ్రెస్ శ్రేణులు తమ ఓటు బ్యాంకు చీలుతుందన్న ఆందోళనలో ఉన్నారు. దీనికితోడు సహజంగానే కాంగ్రెస్ పార్టీలో ఉండే అసంతృప్తి నేతలు దానికి మరింత ఆజ్యం పోసే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా ఒకరిద్దరు బలమైన నేతలు కూడా కాంగ్రెస్ పార్టీని వీడారు. ఈ పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి టీఆర్ఎస్‌కు బీజేపీయే సరైన పోటీ అనేవిధంగా రాజకీయ వాతావరణం తీసుకురాగల్గితే, ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఖచ్చితంగా కమలం వైపు మళ్లుతుందని బీజేపీ నేతలు ఆశపడుతున్నారు. ఇందుకోసం తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బలమైన ఓటింగ్ కలిగిన టీడీపీతో పొత్తు పెట్టుకోవడం లాభిస్తుందని భావిస్తున్నారు. సుమారు 40 నియోజకవర్గాల్లో ఏపీకి చెందినవారు ఎక్కువ సంఖ్యలో స్థిరపడినట్లు గుర్తించారు. ఈ ఓటింగ్ టీడీపీ అధినేత చంద్రబాబు తీసుకునే రాజకీయ నిర్ణయానికనుగుణంగానే మరలుతుందని కమలనాథులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటివరకు టీడీపీ నేతలు ఎక్కువశాతం టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆపార్టీ ఓటింగ్‌కు కూడా టీఆర్ఎస్ వైపు మళ్లింది. అయితే 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఓటమికి కారణం కావడంతో పాటు, ఇప్పటికీ సీఎం జగన్‌ను కేసీఆర్ ప్రోత్సహించడంపై టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, చంద్రబాబుతో ఎన్నికల పొత్తు పెట్టుకోవడం ద్వారా ఆ పార్టీ ఓటింగ్‌ను రాబట్టుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తెలంగాణలో వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనుండగా, ఏపీలో 2024లో జరుగనున్నాయి. టీడీపీతో ఎన్నికల పొత్తు పెట్టుకుంటే తెలంగాణలో లబ్ధి పొందడంతో పాటు, ఏపీలోనూ కొన్ని ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు గెల్చుకునే అవకాశం ఉంటుందని తెలుగు రాష్ట్రాలకు చెందిన కమలనాథులు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇప్పటికే జనసేనతో కల్సి ప్రయాణం చేస్తున్నందున ఆపార్టీ ఓటింగ్ కూడా బీజేపీ అధికారం చేజిక్కించుకోవడానికి దోహదపడుతుందని చెపుతున్నారు. తెలంగాణలో బీజేపీకి ఓటింగ్ పెరగడానికి టీడీపీతో పొత్తు మినహా ఎటువంటి అవకాశాల్లేవని వీరు చెప్పినట్లు సమాచా రం. 2019 ఎన్నికలకు ముందు బీజేపీతో తెగదెంపులు చేసుకున్న చంద్రబాబు, సుదీర్ఘకాలం తర్వాత ఈనెల 6వ తేదీ ఆజాదీ అమృత్ మహోత్సవ్ కార్యక్రమం లో ప్రధాని మోదీని కలిశారు. ఈసందర్భంగా వారిద్దరూ 5 నిమిషాల పాటు ప్రత్యేకంగా మాట్లాడుకోవడం రెండు రాష్ట్రాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. రానున్న ఎన్నికల్లో మళ్లీ రాజకీయ సమీకరణలు మారనున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

చేనేతపై జీఎస్టీ మరణ శాసనమే

(మొదటిపేజీ తరువాయి)

స్వదేశీ ఉద్యమం వైపు మళ్లించారన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు గాంధీ చరకా పట్టి నూలు వడికితే జాతి మొత్తం కదిలిందని గుర్తు చేశారు. కానీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు నిండిన తరుణంలో కేంద్రం చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధించడం దురదృష్టకరమన్నారు. చేనేత, మరమగ్గాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కేటీఆర్ వివరించారు. చేనేత మిత్రద్వారా 50శాతం రాయితీ అందిస్తున్నామన్నారు. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించేలా ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించేలా చూస్తున్నామన్న కేటీఆర్... ప్రతి సోమవారం ఉద్యోగులు నేత వస్త్రాలను ధరించాలని విజ్ఞప్తి చేశారు. రామప్ప చేనేత చీరలను ఆవిష్కరించడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఎమ్మెల్సీ రమణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి , చాలామంది ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయం పరవళ్లు...

మూడు గేట్ల ద్వారా 83,673 క్యూసెక్కుల నీరు విడుదల

విశాలాంధ్ర - శ్రీశైలం: శ్రీశైలం జలాశయం నిండుకుండలా పరవళ్లు తొక్కుతోంది. ఎగువున కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి నీరు వచ్చి చేరడంతో మూడు గేట్లు పది అడుగుల మేర ఎత్తి దిగువకు 83,673 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 884.60 అడుగులు ఉంది. కెపాసిటీ 215.807 టీఎంసీలు కాగా, 213.4011 టీఎంసీలుగా ఉంది. పోతిరెడ్డిపాడు సుంకేసుల నుంచి 90 .293 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతుంది. ఆంధ్ర, తెలంగాణ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, పరవళ్లు తొక్కుతున్న జలాశయాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు విచ్చేశారు. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న పాలనురగలాంటి అలలను చూసి పిల్లలు కేరింతలు కొట్టారు. మంచుతుంపరలా నీటి బింధువులు మీదపడుతుండడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా జలాశయం పరవళ్లను తమ సెల్ఫీలతో బంధించారు. ముందుజాగ్రత్త చర్యలో భాగంగా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

కేంద్ర మంత్రిమండలిలో జేడీయూ ఉండదు..

పాట్నా : కేంద్ర మంత్రిమండలిలో జేడీ(యూ) ఉండదని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆదివారం ప్రకటించారు. ఆర్‌సీపీ సింగ్ రాజీనామా తర్వాత మంత్రిమండలిలో జేడీ(యూ)కు ప్రాతినిధ్యం లేదు. జేడీ(యూ) జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌సీపీ సింగ్ నిష్క్రమణ ఊహించిందేనని చెప్పారు. ఆయన భౌతికంగా తమతో ఉన్నా ఆత్మ మాత్రం ఎక్కడో ఉందని వ్యాఖ్యానించారు. '2019లో లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రప్రభుత్వంలో భాగస్వామి కాకూడదని నిర్ణయించాం.. అందుకు కట్టుబడి ఉన్నాం' అని ఆయన చెప్పారు. తమ పార్టీకి, బీజేపీకి మధ్య ఎలాంటి సమస్య లేదన్నారు. కోవిడ్ నుంచి కోలుకున్న క్రమంలో నీతిఆయోగ్ సమావేశానికి నితీశ్ గైర్హాజరైనట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బీజేపీతో ఎలాంటి వివాదం లేదని ఆ మేరకు వచ్చిన వార్తలను కొట్టిపారేశాయి. ఆర్‌సీపీ సింగ్ శనివారం జేడీ(యూ)ను వీడారు.

పసిడి 'పంచ్'లు

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడా అదే అద్భుత ప్రదర్శన చేసింది. తుదిపోరులోనూ కార్లేపై 5-0తో గెలిచి పసిడి పతకం అందుకుంది.

ఇక అథ్లెటిక్స్ లో భారత ట్రిపుల్ జంపర్ ఎల్డోస్ పాల్ పసిడి పతకం గెలవగా, భారత్ కు చెందిన అబూబకర్ కు ఇదే క్రీడాంశంలో రజతం దక్కింది. పసిడి పతకం గెలిచే క్రమంలో ఎల్డోస్ పాల్ తన అత్యుత్తమ ప్రదర్శన 17.03 మీటర్లు నమోదు చేయడం విశేషం. అబూబకర్ 17.02 మీటర్లతో రెండోస్థానంలో నిలిచాడు. అథ్లెటిక్స్ లో మరో రెండు కాంస్యాలు కూడా భారత్ ఖాతాలో చేరాయి. మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాణి, పురుషుల 10 వేల మీటర్ల నడకలో సందీప్ కుమార్ కాంస్య పతకాలను సాధించారు.

మహిళల హాకీలో న్యూజిలాండ్‌తో జరిగిన పోరులో పెనాల్టీ షూటవుట్‌లో 2-1 తేడాతో భారత మహిళలు విజయం సాధించారు. మ్యాచ్ ముగియడానికి కొద్ది సెకన్ల ముందు న్యూజిలాండ్ 1-1తో స్కోరును సమం చేసింది. దీంతో ఆట పెనాల్టీ షూటవుట్‌కు దారితీసింది. ఇందులో భారత్ అద్భుతమైన ప్రదర్శన చేసింది. పెనాల్టీ షూటవుట్‌లో న్యూజిలాండ్ ఒకే గోల్ సాధించగా.. భారత జట్టు 2 గోల్స్ కొట్టి కాంస్య పతకాన్ని చేజిక్కించుకుంది. కామన్వెల్త్ గేమ్స్ హాకీలో భారత్‌కు ఇది మూడో పతకం కాగా, చివరిసారి 2006లో పతకం సాధించింది. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు పతకం సాధించి 16 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన సెమీస్‌లో భారత జట్టును రిఫరీ తప్పిదం దెబ్బ తీసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత్ పెనాల్టీ షూటౌట్లో 0-3 తేడాతో ఓటమి చవిచూసింది.

ఫైనల్స్‌కు సింధు, లక్ష్యసేన్

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు కామన్వెల్త్ క్రీడల షటిల్ బ్యాడ్మింటన్ లో ఫైనల్స్ లోకి ప్రవేశించింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో సింధు 21-18, 21-17 సింగపూర్ క్రీడాకారిణి యియో జియా మిన్ పై వరుస గేముల్లో గెలుపొందింది. రెండు గేముల్లో సింగపూర్ షట్లర్ నుంచి ప్రతిఘటన ఎదురైనప్పటికీ, సింధు తన అనుభవాన్ని రంగరించి, కీలక సమయాల్లో పైచేయి సాధించింది. మహిళల సింగిల్స్ లో సింధు ఫైనల్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖాయమైంది. సింధు మాత్రం పసిడి పతకానికే గురిపెట్టినట్టు కామన్వెల్త్ క్రీడల్లో తన ఆటతీరు చూస్తే స్పష్టమవుతుంది. సింధు ఫైనల్లో కెనడాకు చెందిన మిచెల్లీ లీతో తలపడనుంది. ఇక బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారుడు లక్ష్యసేన్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. సెమీఫైనల్స్ లో సింగపూర్ షట్లర్ జియా హింగ్ థేపై 21-10, 18- 21, 21 -16 తేడాతో విజయాన్ని సాధించి ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. కాగా కామన్వెల్త్ పతక విజేతలందరికీ ట్విట్టర్ వేదికగా ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

పురుషుల హాకీలో ఉత్కంఠ విజయం

కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పురుషుల హాకీ జట్టు అదరగొట్టింది. దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో 3-2 తేడాతో జయభేరి మోగించింది. ఈ విజయంతో ఫైనల్‌కు చేరుకుంది. మ్యాచ్ ప్రారంభమయ్యాక కొంత సేపటి వరకు రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. ఆ తర్వాత అభిషేక్ గోల్ కొట్టడంతో భారత్ 1-0 ఆధిక్యం సంపాదించింది. ఆ తర్వాత మణ్‌దీప్ సింగ్ చేసిన మరో గోల్‌తో 2-0తో పటిష్ఠ స్థితికి చేరింది. కాగా దక్షిణాఫ్రికా తరపున రెయాన్ జూలిస్ గోల్ కొట్టడంతో స్కోరు 2-1కి చేరుకుంది. చివరిలో డ్రాగ్ ఫ్లికర్ జుగ్‌రాజ్ గోల్ కొట్టడంతో భారత్ 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక దక్షిణాఫ్రికా జట్టు రెండో గోల్ చేయడంతో చివర్లో కాస్త ఉత్కంఠ నెలకొన్నప్పటికీ భారత్ ప్రత్యర్థిని గోల్స్ చేయకుండా అడ్డుకొని ఫైనల్‌కు చేరింది.

48 పతకాలతో 4వ స్థానం...

కామన్వెల్త్ క్రీడల్లో పతకాల వేటలో దూసుకుపోతున్న భారత్ తాజా గణాంకాల ప్రకారం.. 17 స్వర్ణాలు, 12 రజతాలు, 19 కాంస్యాలతో 4వ స్థానంలో ఉంది. భారత్ ఖాతాలో ఇప్పటివరకు మొత్తంగా 48 పతకాలున్నాయి. 44 పతకాలతో ఉన్న న్యూజిలాండ్ 4వ స్థానంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆస్ట్రేలియా 164 (61 స్వర్ణాలు) పతకాలతో మొదటి స్థానంలో కొనసాగుతుండగా, ఆతిథ్య దేశం ఇంగ్లాండ్ 155 (50 స్వర్ణాలు), కెనడా 85 (23 స్వర్ణాలు) పతకాలతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

తెలంగాణ కీర్తి విశ్వవ్యాపితమైంది: కేసీఆర్

కామన్వెల్త్ క్రీడల్లో నిఖత్ జరీన్ స్వర్ణం సాధించడంపై తెలంగాణ సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తంచేశారు. అద్భుత ప్రదర్శనతో పసిడి పతకం సాధించిన జరీన్‌కు అభినందనలు తెలిపారు. ఆమె గెలుపుతో తెలంగాణ కీర్తి మరోసారి విశ్వవ్యాపితమైందన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు తప్పనిసరి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సంపూర్ణ న్యాయం జరగాలంటే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. మాజీ ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (వీపీ సింగ్) వర్ధంతి సభ విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. దీనిని ఇండియన్ ప్రజా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐపీటీయూసీ) అధ్యక్షుడు దేవరపల్లి మహేష్ అధ్వర్యంలో నిర్వహించగా, జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం కోఆర్డినేటర్ జైబాబు అధ్యక్షత వహించారు. తొలుత వీపీ సింగ్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు రిజర్వేషన్లు ఉండాలనే ఉద్దేశంతో ఆనాటి ప్రధాని వీపీ సింగ్ ప్రయత్నిస్తున్న సమయంలో ఎంతో మంది అడ్డుకోవటమే కాకుండా ప్రభుత్వాన్ని సైతం కూలదోయటానికి ప్రయత్నించారన్నారు. అయినా ఆయన మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయటానికి ప్రాధాన్యత ఇచ్చారని, అందుకే నేడు బీసీలకు 27 శాతం ఉద్యోగ, విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయన్నారు. అంతటి మహనీయుడిని ఎన్నటికీ మరువరాదన్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి ఒకదాని తర్వాత ఒకటి ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు వారికి దోచిపెడుతున్నారని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు ఉండబోవన్నారు. మోదీ 8 ఏళ్ల పాలనలో ఇప్పటికి 26 ప్రభుత్వ రంగ పరిశ్రమలు అమ్మేశారని, 32 మంది ప్రాణత్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును కూడా ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. మరో అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. మండల్ కమిషన్ రావటం వల్లే ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు రిజర్వేషన్లు పొందగలుగుతున్నారన్నారు. దేశంలో భూమి లేని పేదలకు భూపంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బడా పారిశ్రామిక వేత్తలు, కార్పోరేట్ శక్తులు దేశ సంపదను కొల్లగొడుతున్నారని వారికి మోదీ ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తోందని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీలతో పాటు బీసీలకు న్యాయం జరగాలంటే బీసీల జనగణన జరగాలన్నారు. ఇందుకోసం వామపక్ష పార్టీలు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఐపీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం కోఆర్డినేటర్ జై బాబు మాట్లాడుతూ... కోట్లాదిమంది వెనుకబడిన వర్గాల వారికి ఉద్యోగ, రాజకీయ, విద్యా విషయాలలో 27% రిజర్వేషన్ కల్పించిన మండల కమిషన్ నేటికి పూర్తిగా అమలు కావటంలేదన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు సమైక్య పోరాటంతో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఎమ్‌సీపీఐ నాయకులు తూమాటి శివయ్య మాట్లాడుతూ... బీజేపీ, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలని, అవసరమైనప్పుడు వారు ఏకమై బలహీన వర్గాలను అణచివేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక హెూదా సాధన ప్రజా పరిషత్ నాయకుడు చింతా రాజశేఖర్, బీఎస్పీ నాయకుడు కె.ప్రభుదాసు, ఆమ్ ఆద్మీ నాయకులు జి.ఎస్. ఫణి రాజు, పి.శ్రీనివాస్ గౌడ్, కే ఎలీషా, నందిపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై దేవరపల్లి మహేష్, జల్లి విల్సన్, రాజశేఖర్, ప్రభుదాసు, ఫణిరాజు తదితరులు

ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర బాబు, లెనిన్ బాబు

విశాలాంధ్ర-గుంటూరు: రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర బాబు, నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులను చిన్నచూపు చూస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 2.35 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉంటే భర్తీ చేయకపోవడం నిరుద్యోగులను మోసం చేసినట్లుగానే భావించాల్సి వస్తుందన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాలని, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల నియామకాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి నిరుద్యోగ యువతను ఏ విధంగా మోసం చేసిందో, అదేతీరులో జగన్‌మోహన్ రెడ్డి కూడా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే విధంగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం కేవలం నిరుద్యోగులను మోసం చేయడమే కాకుండా దేశ భద్రతకు భంగం వాటిల్లే విధంగా ఉన్నదని, వెంటనే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, గుంటూరు నగర కార్యదర్శి చల్లా మరియదాసు, నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించిన వేళ...

గర్భిణీ, ఇద్దరు పసిబిడ్డలను కాపాడిన 108 సిబ్బంది

విశాలాంధ్ర-కొమరాడ/ పార్వతీపురం బెలగాం: మానవత్వం పరిమళించిన వేళ... ఓ వైపు కటిక చీకటి ... మరో వైపు భారీ వర్షం ... సరైన రహదారి లేనిస్థితి ... ప్రతికూల వాతావరణంలో అర్ధరాత్రివేళ ఏజన్సీ ప్రాంతంలో 108 సిబ్బంది గర్భిణీ, ఇద్దరు పసిబిడ్డలను కాపాడి అందరి ఆదరాభిమానాలు చూరగొన్నారు. వివరాలలోకి వెళితే... కొమరాడ మండలం సీసాడవలస గ్రామానికి చెందిన బీ వసంత అనే గర్భిణీకి నొప్పులు రావడంతో ఆశా వర్కర్ అగ్గిఅమ్మ 108కు సమాచారం అందించింది. సీసాడవలసలోకి 108 వాహనం వెళ్లే పరిస్థితి లేనప్పటికీ పెద్దపెద్ద గుమ్ములను దాటుకుంటూ వర్షంలోనే సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. గర్భిణీని వాహనంలో ఎక్కించి బయలుదేరిన కొద్ది సేపటికే ఆమె ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. అక్కడితో ఆగకుండా డ్రైవర్ శ్రీనివాసరావు, టెక్నీషియన్ వీ అప్పలనాయుడు కటిక చీకట్లో బురదలోనే వాహనాన్ని నడుపుకుంటూ భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి చేర్చి తల్లీబిడ్డలను కాపాడారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో 108 సిబ్బంది సిసాడవలస రాకపోతే గర్భిణీ, ఇద్దరు ఆడపిల్లలు మృతిచెందే వారని గ్రామస్తులు చెపుతున్నారు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో 108 వాహనానికి ఫోన్ చేసి, తల్లిబిడ్డలను కాపాడడంలో ముఖ్యభూమిక పోషించిన ఆశా వర్కర్ ను గ్రామస్తులు అభినందించారు.

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించండి: స్వాతంత్ర్యం వచ్చి నేటికీ 75 సంవత్సరాలైనా కొన్ని గిరిజన గ్రామాలకు రహదారి లేక అష్టకష్టాలు పడుతున్నారనీ, బయటి ప్రపంచానికి తెలియకుండానే ఎంతో మంది గర్భిణీలు మృతి చెందారని, ఇప్పటికైనా పాలకులు గిరిపుత్రుల కష్టాలు తీర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి , సీఐటీయూ భవన కార్మికుల సంఘం నాయకుడు యామక గౌరునాయుడు డిమాండ్ చేశారు.

తిరోగమన భావజాలాన్ని తిప్పికొట్టాలి

అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సమాజానికి హానిచేసే, తిరోగమన భావజాలాన్ని కవులు, రచయితలు బలంగా తిప్పికొట్టాలి... అది అభ్యుదయ రచయితల బాధ్యత అని అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం గుంటూరు బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి రాచపాళెం అధ్యక్షత వహించారు. అరసం 19వ రాష్ట్ర మహాసభల్ని 2023 ఫిబ్ర వరిలో నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. అరసం 80 వార్షికోత్సవాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలలో నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో అరసం నిర్మాణ పరిధిని విస్తృత పర్చాలని, శాఖలను మరింత బలోపేతం చేయాలని జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. నవతరం రచయితలకు మార్గనిర్దేశకత్వం చేసేలా రాష్ట్ర స్థాయి సాహిత్య కార్యశాలను సెప్టెంబర్‌లో నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అరసం రాష్ట్ర నాయకుడు జీఎస్ చలం సంపాదకత్వంలో ప్రచురించిన 'గురజాడ దేశభక్తి గురించి' అంశంపై ప్రముఖ సాహితీ వేత్తల వ్యాస సంకలనాన్ని రాచపాళెం ఆవిష్కరించారు. అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో మరణించిన సాహితీ ప్రముఖులకు సమావేశంలో అరసం నివాళు లర్పించింది. పాఠశాల విద్యలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని అరసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దాదాపు పుష్కర కాలం అనంతరం గ్రంథాలయ సంస్థలకు పుస్తకాల్ని కొనడంపై హర్షం వ్యక్తం చేసింది. రచయితలు, ప్రచురణ కర్తలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అరసం డిమాండ్ చేసింది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాళెం, శివప్రసాద్, పెనుగొండ తదితరులు

17న ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవం

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరపాలని సుబ్బారావు, జనార్థన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఈనెల 17వ తేదీ నాటికి ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు స్థాపించి 65 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ పతాకాల ఆవిష్కరణతో పాటు వివిధ అంశాలపై సభలు, సమావేశాలు నిర్వహించాల్సిందిగా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్థన్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పత్రికారంగంలో వస్తున్న మార్పులు, మీడియా స్థితిగతులు, యాజమాన్యాల, ప్రభుత్వాల ధోరణులు, పాత్రికేయుల సమస్యలు వంటి అంశాలపై పౌరసమాజానికి మన యూనియన్ అభిప్రాయాలను తెలియ చేసేలా విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. 1957 ఆగస్టు 17న హైదరాబాద్ జూబిలీ హాల్‌లో భారత పత్రికారంగ పితామహులలో ఒకరైన వర్కింగ్ జర్నలిస్టుల కార్మికోద్యమనేత, మనికొండ చలపతిరావు చేతులమీదుగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భవించిందని తెలిపారు. పత్రికాస్వేచ్ఛ, పాత్రికేయుల హక్కులు, మెరుగైన పని పరిస్థితులు, వేతన, ఉద్యోగ భద్రత, వృత్తి ప్రమాణాల వృద్ధి వంటి ఆశయాలతో యూనియన్ ఏర్పడిందన్నారు. తెలుగు పత్రికారంగ దిగ్గజాలు అనదగ్గ ప్రముఖ పాత్రికేయులంతా వృత్తిజీవితంలో ఏదో ఒకదశలో ఏపీయూడబ్ల్యూజేతో అనుబంధం కలిగివున్నవారే కావడం మనకు గర్వకారణమన్నారు.

జాతీయ పత్రికారంగ కార్మికోద్యమంలో కూడా మన యూనియన్ కీలక పాత్ర పోషిస్తుండడం మనకు ఎంతో స్ఫూర్తినిస్తున్నదని, అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం పాత్రికేయులు అనుభవిస్తున్న ప్రతి ఒక్క సదుపాయాన్నీ సాధించినది ఏపీయూడబ్ల్యూజే కావడం ఒక చారిత్రక వాస్తవమన్నారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ కమిటీల్లో ప్రాతినిధ్యం కలిగి గత 65 ఏళ్లుగా ప్రభుత్వాల విధాన నిర్ణయాలను ప్రభావితం చేస్తూ రావడం జర్నలిస్టులందరికీ తెలిసిన విషయమేనన్నారు. 1957లో కేవలం 37 మంది సభ్యులతో ఏర్పడిన ఏపీయూడబ్ల్యూజే 2014లో రాష్ట్ర విభజన జరిగే సమయానికి 16,400 మందికి పైగా సభ్యులతో ఐజేయూ అనుబంధ రాష్ట్ర సంఘాలలో అతిపెద్ద యూనియన్‌గా గుర్తింపు పొందింది. 2021 డిసెంబర్ 31 నాటికి కార్మిక శాఖకు సమర్పించిన వార్షిక రిటర్న్ ప్రకారం సుమారు 9 వేల మంది సభ్యులతో దేశంలోనే అతి పెద్ద యూనియన్‌గా కొనసాగుతున్నదన్నారు. జర్నలిస్టుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు సాగిస్తూ, ఎంతో సమరశీల చరిత్ర కలిగిన ఏపీయూడబ్ల్యూజే 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 26 జిల్లాల్లో సభలు, సమావేశాలు, స్థానికంగా పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు.

కేటీఆర్ సవాల్ స్వీకరించిన పవన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ విసిరిన చేనేత ఛాలెంజ్‌ను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్వీకరించారు. చేనేత వస్త్రాలు ధరించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం ద్వారా చేనేత వస్త్రాల వినియోగానికి మరింత ప్రోత్సాహం పెంచాలని ఉద్దేశించారు. ఇందులో భాగంగా పవన్ కళ్యాణ్ తాను చేనేత వస్త్రాలు ధరించిన ఫోటోలను ఆదివారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అనంతరం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌లను చేనేత ఛాలెంజ్‌కు నామినేట్ చేశారు.

గిరిజనులకు పెద్దపీట : మంత్రి సింగిరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: బిజేపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అక్కడ అమలు అవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా అమలు కావడం లేదన్నారు. ఆదివారం మహారాష్ట్ర లోని థానే కేపీఆర్ డిగ్రీ కళాశాల, బోరేవళి నలంద అకాడమీలో నిర్వహించిన వనపర్తి నియోజకవర్గ గిరిజన సోదరుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏది ఇవ్వనోడు ఎగిరెగిరి పడుతున్నాడు, అన్నీ ఇచ్చిన కేసీఆర్ మాత్రం ఇది మన కుటుంబం చక్కగా కుటుంబాలను చూసుకోమని అంటున్నారని చెప్పారు. తెలంగాణ రాకతో తండాలలో గిరిజనుల ఆర్థికశక్తి పెరిగిందని, రైతుబంధు, రైతుభీమా, సాగునీళ్లు, ఉచిత కరంటు పథకాలతో వ్యవసాయం బలపడిందన్నారు. అమ్మవడి, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి పథకాలతో గిరిజన బిడ్డలకు అండగా నిలుస్తుందన్నారు. నేను చదువు కున్నప్పుడు నాతో పాటు ఒక్క గిరిజన విద్యార్థి కూడా లేడని కానీ నేడు తండాలలో చదువుకోని విద్యార్థి ఎవరూ లేరన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం 70 శాతం హామీలు నెరవేరాయని, నేడు మిమ్మల్ని కలుసు కోవడం కడుపు నిండినట్లుం దన్నారు. తండా లలో అన్ని వసతులు కల్పిస్తున్నాం. మిగతా నియోజకవర్గాలకు భిన్నంగా అధికసంఖ్యలో డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో తండాలలో నిరుపేదలను గుర్తించి డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు.

అర్హులకు నేతన్ననేస్తం

జాతీయ చేనేత దినోత్సవంలో ఎమ్మెల్సీ తలశిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం అర్హులయిన ప్రతి ఒక్కరికీ నేతన్ననేస్తం పథకాన్ని వర్తింప చేస్తుందని శాసన మండలి సభ్యుడు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్ అన్నారు. ఆదివారం విజయవాడ ఆప్కో కేంద్ర కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయిన తలశిల మాట్లాడుతూ చేనేత కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం తరువాత చేనేత రంగం అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తుందని, దేశంలోని మొత్తం వస్త్ర ఉత్పత్తిలో 19 శాతం చేనేత రంగం ద్వారా ఉత్పత్తి జరుగుతుందన్నారు. కేవలం తమ ఉనికి కోసమే ప్రతిపక్షాలు ప్రభుత్వ పథకాలపై అసత్య ప్రచారం చేస్తున్నాయని తలశిల విమర్శించారు. విజయవాడ సెంట్రల్ శాసన సభ్యులు మల్లాది విష్ణు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో చేనేత ప్రముఖ పాత్ర పోషించిందని, 2015 సంవత్సరం నుంచి భారత ప్రభుత్వం గ్రామీణ ఉపాధికి తోడ్పడుతున్న చేనేత రంగాన్ని గుర్తించి ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. భారతదేశ వారసత్వ సంపదగా ఉన్న చేనేత రంగంపై అవగాహన కల్పించి, చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంపొందించటమే ధ్యేయంగా జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నా మన్నారు. విజయవాడ పశ్చిమ శాసన సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1,28,662 మంది చేనేత కార్మికులుండగా, మరో 49,785 మంది అనుబంధ కార్యకలాపాలలో ఉపాధి పొందుతున్నారన్నారు. నేతన్నలు తయారుచేసిన ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఆప్కో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వారికి నిరంతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి సంవత్సరానికి రూ.24 వేలను నేతన్న నేస్తం పథకం ద్వారా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఆప్కో చైర్మన్ చిల్లపల్లి వెంకట నాగ మోహనరావు మాట్లాడుతూ చేనేత వస్త్రాలు అందరికీ అందుబాటులో ఉండాలన్న ధ్యేయంతో ఈ కామర్స్ దిగ్గజాలైన అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మింత్రా తదితర ఆన్ లైన్ విక్రయ సంస్థలతో ఒప్పందం చేసుకుని, ప్రపంచ వ్యాప్తంగా ఆప్కో చేనేత వస్త్రాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రైవేటు వస్త్ర వ్యాపార సంస్థలకు పోటీగా విజయవాడ, తిరుపతి, ఒంగోలు, గుంటూరు, కడప పట్టణాలలో మెగా షోరూమ్‌లు, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలలో నూతన హంగులతో షోరూమ్‌లను ప్రారంభించామన్నారు. మరోవైపు హైదరాబాద్ మెహిదీ పట్నంలో సైతం ఆప్కో నూతన మెగా షోరూంను ప్రారంభించామన్నారు. యువతను చేనేత వస్త్రాలవైపు ఆకర్షింపచేసేలా ఉత్పత్తులలో నూతన ఒరవడి సృష్టించి, మార్కెట్లో ఆప్కో బ్రాండ్ ఇమేజ్ పెంపొందించే క్రమంలో సరికొత్త డిజైన్ల తయారీకి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజి, నేషనల్ డిజైన్ సంస్థల సహకారం తీసుకుంటున్నామని చిల్లపల్లి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100 కోట్ల వ్యాపారం చేయాలనే లక్ష్యంతో ఆప్కో కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తుం దన్నారు. వీవర్స్ సర్వీస్ సెంటర్ ఆఫీసర్ ఇన్‌చార్జి పీఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ చేనేత వస్త్రాలు పర్యావరణ నేస్తాలని, హుందాతనానికి ప్రతిరూపంలో నిలిచే వీటిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. జాతీయ చేతి వృత్తుల అభివృద్ధి సంస్థ రీజనల్ మేనేజర్ సకోడియా మాట్లాడుతూ వారానికి ఒక్కసారి తప్పనిసరిగా చేనేత వస్త్రాలను ధరించటం ద్వారా కార్మికులకు నిరంతరం పని కల్పించ గలుగుతామన్నారు. చేనేత జౌళి శాఖ సంయుక్త సంచా లకులు మైసూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పురాతన సాంప్రదాయ చేనేత కళను కాపాడుకోవలసిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ అధికారి లేళ్ల రమేష్ బాబు, ప్రాంతీయ మార్కెటింగ్ అధికారి బి.వి.రమణ పాల్గొన్నారు. ధర్మవరానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజును ఈ సందర్భంగా సత్కరించారు.

మంత్రి ఎర్రబెల్లి సోదరుడు టీఆర్ఎస్‌కు గుడ్ బై

ఫలించని బుజ్జగింపులు - టీఆర్ఎస్‌పై విమర్శలు

విశాలాంధ్ర-హైదరాబాద్: గత వారం రోజులుగా సాగుతున్న చర్చకు ముగింపు పలుకుతూ రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోదరుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన వరంగల్ లో విలేకరుల సమావేశంలో తన రాజీనామా విషయాన్ని ప్రకటించారు. ప్రదీప్ రావును బుజ్జగించేందుకు టీఆర్ఎస్ నేతలు చేసిన బుజ్జగింపులు ఫలించలేదని తెలుస్తోంది. టీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు కనీసం సహాయం చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. 9 సంవత్సరాలు టీఆర్ఎస్‌లో క్రమశిక్షణతో ఉండి నిస్వార్థంగా పనిచేశానని, పదవులు ఇయ్యకున్నా పార్టీకి సేవ చేస్తూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు. కనీస గుర్తింపు లేనప్పుడు పార్టీలో ఉండి ఏం లాభమని, సంస్కారం లేని నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారని వ్యాఖ్యానించారు. ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకోలేదని, వరంగల్ తూర్పు ప్రజలతో కలిసి ముందుకు నడుస్తానని ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా సాగిన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించామని, ఉద్యమ ప్రయోజనాల కోసం తాను స్వయంగా ఏర్పాటు చేసిన తెలంగాణ నవ నిర్మాణ సమితి పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేశామని ప్రదీప్ రావు గుర్తు చేసుకున్నారు. వరంగల్ తూర్పు టికెట్టు ఇస్తామని చెప్పి రెండుసార్లు మోసం చేశారన్నారు. ఆ

స్వప్రయోజనాలే పరమావధిగా పాలన

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ: 542వ రోజుకు రిలే దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: నాటి పాలకులు దేశభక్తితో ప్రజల సంక్షేమం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే వారని, కానీ నేడు తమ సొంత ప్రయోజనాల కొరకు రాజకీయాలను నడుపుతూన్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు రిలే దీక్షలు ఆదివారం 542వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజారంజకమైన పాలన గాలికొదిలి, స్వప్రయోజనాలే పరమావధిగా పాలన సాగిస్తున్నారని, ఇది దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. రాజకీయ పార్టీల నేతలు స్వలాభం కోసమే ప్రధానిని కలిసి మాట్లాడుతున్నారనీ, లక్షలాది మందికి ఉపాధి కల్పించిన పరిశ్రమను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తుంటే నోరు మెదపకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఉద్యమాల స్ఫూర్తితో ఆవిర్భవించిన విశాఖ స్టీల్ ప్లాంట్‌పై స్పందించికపోవడం అత్యంత శోచనీయమన్నారు. పోరాట కమిటీ సభ్యులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య, సీఐటీయూ నాయకులు శ్రీనివాసరాజు ప్రసంగించారు. దీక్షలో నాగరాజు, తాతారావు, మంత్రి రవి, మురళీకృష్ణ, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

26 జిల్లాల నుంచి 75 మంది క్రీడాకారుల హాజరు

విశాలాంధ్ర-రాప్తాడు: భారత ప్రభుత్వం గుజరాత్ రాష్ట్ర సహకారంతో సెప్టెంబరులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 36వ జాతీయ క్రీడలలో పాల్గొనే ఏపీ పురుషుల సాఫ్ట్ బాల్ జట్టును అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం ఎంపిక చేశారు. పరిశీలకుడిగా ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమరనాథరెడ్డి, రెజ్లింగ్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు సాయికిషోర్ హాజరయ్యారు. సమరనాథరెడ్డి మాట్లాడుతూ, జాతీయ క్రీడలలో మన జట్టు ప్రథమ స్థానంలో నిలవాలని, అందుకు ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. సాఫ్ట్ బాల్ సంఘం ఏపీ సీఈఓ సి. వెంకటేసులు మాట్లాడుతూ, ఆర్డీటీ సహకారంతో సాఫ్ట్ బాల్ క్రీడ ఏపీలో దినదినాభివృద్ధి చెందిందని, జాతీయస్థాయి పోటీలలో క్రమశిక్షణతో ఆడి విజయపథంలో నిలవాలని ఆకాంక్షించారు. జట్టు ఎంపికకు 26 జిల్లాలకు చెందిన 75 మంది సీనియర్ సాఫ్ట్ బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. సెలక్షన్ కమిటీ మెంబర్లు సాఫ్ట్ బాల్ ఏపీ ప్రధాన కార్యదర్శి సి.నాగేంద్ర, పి.నరసింహారెడ్డి, జి. ప్రసాద్, ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, పీడీలు ఎన్. కేశవమూర్తి, ఎం. చంద్రశేఖర్, జి.రాజేంద్రప్రసాద్, సీనియర్ శిక్షకులు బద్రి నారాయణ, దీక్షిత్ సాయి, నందిని, కళ్యాణి పాల్గొన్నారు.

మార్క్సిస్టు సౌందర్య శాస్త్రవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి

గియోర్గి లూకాచ్

సాహితి

డా॥ తక్కోలు మాచిరెడ్డి, సెల్: 9666626546

మధ్య యూరప్‌లోని ఒక చిన్న దేశం హంగేరి. 1885 వ సంవత్సరం ఏప్రిల్ 13 న బుడాపెస్ట్‌లో ఓ సంపన్న యూదు కుటుంబంలో జన్మించాడు గియోర్గి లూకాచ్. అతని నాన్న ఓ బ్యాంకు నిర్వాహకుడు. అమ్మ కఠినమైన క్రమశిక్షణ అమలు చేసే వ్యక్తి. కుటుంబంలోని వారందరూ యూదు వాదాన్ని తిరస్కరించేవారే. లూకాచ్ తొమ్మిదవ ఏటనే హోమర్ రాసిన 'ఇలియడ్' చదివాడు. 15 ఏళ్ల ప్రాయంలో బాదలేర్, ఎమిలిజోలా, ఇబ్సెన్, స్విన్‌బర్న్ రచనల రుచి చూశాడు. ఫ్రెంచ్ భాష నేర్చుకున్నాడు. జర్మనీ, ఆస్ట్రియా ఘటనల్ని ప్రభావితం చేసే పనిలో ఆయన జర్మన్ భాషపై కూడ పట్టు సాధించాడు. 18 వ ఏట తాను రాసిన రచనల్ని నాశనం చేశాడు. 1906 లో- అంటే తన 21 వ సంవత్సరం వయసులో బుడాపెస్ట్‌లో డాక్టరేట్ డిగ్రీ పొందాడు. తర్వాత ఎక్కువ భాగం బెర్లిన్, హైడల్‌బర్గ్ పట్టణాలలో నివసించాడు. 1908 లో కార్ల్‌మార్క్స్ రాసిన 'పెట్టుబడి' చదివాడు. జర్మన్ జాతివాదం కారణంగా వచ్చిన మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిరసించాడు. ఆ సమయంలో రోజా లక్సెమ్‌బర్గ్ రచనలు చదివాడు. హంగెరీ సామ్యవాద పార్టీలో చేరి కమ్యూన్‌లో (1918-1919) తన పాత్ర నిర్వహించాడు. 1919 లో కొంత కాలం పాటు హంగేరిలో ఏర్పాటు చేసిన 'హంగేరి సోవియత్' ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ మంత్రిగా పని చేశాడు. ప్రపంచ విప్లవం వస్తుందని నమ్మాడు. ఈ నమ్మకంతోనే "చరిత్ర- వర్గ చైతన్యం" అనే ఉద్గ్రంథం రాశాడు. (1923) అందులో లూకాచ్ పై హెగెల్ ప్రభావం గమనించవచ్చు. "ఆర్థికానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం కాదు మార్క్స్ వామపక్ష సిద్ధాంత విలక్షణత, సమస్తత అభివర్గానికి ప్రాధాన్యం ఇవ్వడమే దాని విశిష్టత" అని అంటాడు లూకాచ్.

సమస్తత ఒక మౌలిక భావన. ఈ భావన ద్వారా కలిగే చైతన్యం ప్రపంచాన్ని నిర్దేశిస్తుంది. ఒక క్రమంలో లేనట్లు కన్పించే ఘటనలను పొందుపరచి మనకు అవగాహన అయ్యేట్లు చేస్తుంది. ఈ సమస్తతా భావన తత్వశాస్త్రం , కళ ఈ సమస్తతా సారం కోసం అన్వేషిస్తాయి. "చరిత్ర- వర్గ చైతన్యం" అనే గ్రంథం ఏడవ ఎడిషన్‌కు రాసిన భూమికలో (1967) లెనిన్ గురించి రాస్తూ లూకాచ్ "లెనిన్ ఒక సిద్ధాంత కర్త, వ్యవహారదక్షుడు మాత్రమే కాదు, 'ఫిలాసఫర్ ఆఫ్ ప్రాక్సిస్' అని అభివర్ణిస్తాడు. ఆలోచన, ఆచరణ కలగలిసి ఉండేదాన్ని ప్రాక్సిస్ అంటారు. మనిషి వస్తువుగా ఎలా మారతాడో చెబుతూ 'సరుకుల మహిమారాధన' ఆధునిక పెట్టుబడివాద యుగపు ప్రత్యేకమైన సమస్య అని అంటాడు లూకాచ్. ప్రస్తుతానికి అన్వయించుకుంటే, మనిషిని ఇపుడు వస్తువు కంటే సరుకు కంటే హీనంగా పరిగణిస్తున్నారు. పెట్టుబడివాద సమాజంలో మనుషులు చేసిన వస్తు ప్రపంచం మనుషుల పైనే పెత్తనం చలాయిస్తుంది. మనుషులు కేవలం పదార్థాలుగా, వస్తువులుగా, సరుకులుగా, వూరికే కూచునే నిష్క్రియ ప్రేక్షకులుగా తయారవుతున్నారు.

వస్తీకరణ వల్ల కలిగే పరిణామాల్లో ఒకటి సమస్తత యొక్క ప్రతి రూపమూ ధ్వంసం కావడం. ఈ సమస్తతా భావన కార్ల్‌మార్క్స్ హెగెల్ నుంచి తీసుకున్నాడు. దీన్నే లూకాచ్ విశ్లేషించాడు, అన్వయించాడు. సమస్తత ద్వారానే వాస్తవికతను అర్థం చేసుకోవడం, అందులోకి చొరబడగలగడం వీలవుతుంది. అది వర్గం మాత్రమే చేయగలుగుతుంది. అపుడే పరివర్తన సాధ్యమౌతుంది అని లూకాచ్ భావిస్తాడు. ఆనాటి యూరప్ రాజకీయాల్ని విశ్లేషిస్తూ హిట్లర్ గురించి చెప్పాడు లూకాచ్. ఒక రాజనీతిజ్ఞునిగా హిట్లర్ జర్మనీ అధ్యక్షుడు ఎలా అయ్యాడో విశ్లేషించాడు. ఏకాధికార పెట్టుబడివాదం ఫాసిజానికి దారి తీసింది. అరికట్టలేని నిరుద్యోగిత, ప్రజల దారిద్ర్యం వల్ల జనంలో పెట్టుబడివాద వ్యతిరేక పవనాలు వీచసాగాయి. నిరాశ, నిస్పృహ చెందిన మధ్య తరగతి జనం, బుద్ధి జీవుల ప్రజా సమూహాలు జాతీయ సమాజవాదం వైపు మొగ్గారు. జర్మనీకి ఒక విశ్వసనీయమైన, కష్టాలు తీర్చగలిగే అద్భుతాలు చేయగల ఒక నాయకుడు కావలసి వచ్చింది. "దైవ దత్త అసాధారణవ్యక్తి"గా హిట్లర్ రావడం జరిగింది. అంతే ఇక ఏముంది? ఫాసిజంకు దారి సుగమమైంది. దానికి జర్మన్ భూమి పరిపక్వమైనట్లు అయింది. ఇదీ లూకాచ్ విశ్లేషణ. మన దేశంలో ఇపుడు దాదాపు అదే పరిస్థితి కనిపిస్తోంది.

లూకాచ్ సౌందర్య శాస్త్రం

'కళాతాత్వికత' అనే వ్యాసంలో లూకాచ్ సౌందర్యాత్మక స్థాయిని సంతరించుకొనే ప్రకృతి సౌందర్యానుభూతి ఉండవచ్చు అని అంటాడు. అందువల్లే ప్రకృతికి సంబంధించిన ఓ సౌందర్య శాస్త్రం రూపొందించ వచ్చు అని అభిప్రాయపడతాడు. ఆధునికతా వాదం కళను ఉన్నతీ కరించదు. సరికదా అది కళను- నిజమైన కళను తిరస్కరిస్తుంది అని ప్రకటిస్తాడు. సోషలిస్టు సమాజంలో కూడ విమర్శనాత్మక వాస్తవికతా వాదంఉంటుంది. ఉండాలి అని అంటాడు లూకాచ్. మన రస సిద్ధాంతాన్ని పోల్చినట్లు అన్పించే ఒకమాట అంటాడు ఆయన. పాఠకుడు లేక శ్రోత, లేక ప్రేక్షకుడు పునరనుభవిస్తాడు అని అంటూ అది తనదైన అనుభూతి అనీ, కళ నుంచి పొందే అనుభూతి అనీ విశదీకరిస్తాడు. పునరనుభూతి ఎంత తీవ్రంగా ఉంటే అంత స్వతఃస్ఫూర్తంగా కూడ ఉంటుంది. ఆ అనుభూతి అని చెబుతాడు.

1930 దశాబ్ది నుంచి లూకాచ్ కళా సమస్యల్ని గురించి ప్రత్యేకంగా ఆలోచించాడు. మాస్కోలో ఉన్నా స్టాలిన్ వాదాన్ని ముఖ్యంగా జ్దానొవ్ సూత్రీకరణల్ని అంగీకరించేవారు కాదు, బాహాటంగా కాక నర్మగర్భంగా విమర్శించేవారు. మార్క్సవాదాన్ని సౌందర్యశాస్త్రానికి ఎలా అన్వయించాలి అనేఅంశాన్ని లోతుగా ఆలోచించాడు. సంప్రదాయాన్ని అర్థంచేసుకోవడాన్ని అధిగ మించాలి అని భావించాడు. మార్క్సవాదం సమస్త సంప్రదాయానికే వ్యతిరేకం కాదని నమ్మాడు, కార్ల్‌మార్క్స్, షేక్స్పియర్ నాటకాల్ని, కవితల్ని మెచ్చుకునేవాడనీ లూకాచ్ గుర్తుచేసేవాడు. ప్రకృతి కంటే, చిత్రీకరించిన ప్రకృతి అందంగా ఉంటుందనే వాదం సరికదని అనేవాడు. ప్రకృతిసౌందర్యాన్ని ఆస్వాదించలేనివాడు కళను ఎలా ఆస్వాదించగలడు అని ప్రశ్నిస్తాడు. సుందర వస్తువుల్ని, అందమైన ప్రకృతినీ ఆస్వాదించేశక్తి మనకు మానవ పరిణామ చరిత్ర ఇచ్చింది. కళా ప్రయోజనాన్ని గురించి రాస్తూ లూకాచ్ కళ మనల్ని కుల, మత దేశాలకు అతీతంగా ఉంచుతుంది. దేశ కాలాలను అధిగమించేట్లు చేస్తుంది. జీవితంలో గొప్ప క్షణాల్ని ఇస్తుంది. ఇది ఒక జీవిత విలువ. కళకు ఒక ప్రత్యేకత ఉంటుందని, ఒక సమగ్రత ఉంటుందని అంటాడు. లూకాచ్ దృష్టిలో శ్రేష్ఠమైన కళ మానవ జీవితసంపూర్ణత్వాన్ని సమగ్రంగా ప్రతిఫలించాలి. అంతేకాదు కళాకారునికి ఓ ప్రపంచ దృక్పథం- (జర్మన్ భాషలో వెల్టన్ షావుంగ్) ఉండాలంటాడు. 'వెల్టన్ షావూంగ్' అంటే సంవేదనతో కూడిన ప్రపంచ దృక్పథం.

గియోర్గి లూకాచ్

"యూరప్‌లో వాస్తవికతావాదం-ఒక అధ్యయనం" అనే తన గ్రంథంలో లూకాచ్ రష్యన్ రచయితలను గురించిరాస్తూ కొన్ని విషయాలు ప్రస్తావిస్తాడు.-బెలిన్‌స్కి, పూష్కిన్‌ను ప్రశంసించాడనీ, చెర్నిషేవ్‌స్కి దొబ్రల్యుబొవ్ విప్లవ ప్రజాస్వామిక వాదులనీ, (మన గురజాడ లాగ- వ్యాస రచయిత), చెర్నిషేవ్‌స్కి తొల్స్‌తోయ్ రచనలపైనా, అతని వాస్తవికతావాదం పైనా రాశాడనీ వివరిస్తాడు. ఈ ఉద్గ్రంథంలోనే తొల్స్‌తోయ్‌ను గురించి గోర్కీతో లెనిన్ అన్న మాటల్ని లూకాచ్ ఉన్నదున్నట్లు ఉటంకిస్తాడు. లెనిన్ ఉద్వేగంతో ఇలా అన్నాడట- "ఓహో ఎంత విరాట్ రూపం! మహత్తర మూర్తిమత్వం! మన ఆదర్శ కళాకారుడు! అంతకంటె చెప్పుకోదగ్గ అతని రైతు కంఠం! రైతు ఆలోచనా విధానం! స్వభావ రీత్యా కూడ ఆయన ఒక రైతే! తొల్స్‌తోయ్ రాకముందు మన సాహిత్యంలో ఒక్క రైతు రచయిత లేడు" గోర్కి కళ్లలోకి చూస్తూ నిక్కచ్చిగా లెనిన్ అంటాడు- "యూరప్‌లో అతనికి సాటి వచ్చేదెవరు? ఎవరూ లేరు మరి!"

అదే గ్రంథంలో బాల్జాక్‌ను గురించిన ఓ వ్యాసం ఉంది. బాల్జాక్ నవల "రైతులు" లో వాస్తవికతా వాద పాత్ర చిత్రణ ఉంది. జమీందార్లకు వ్యతిరేకంగా రైతులు, వ్యాపారస్తులు చేసిన పోరాటాలు ఈ నవలలో వర్ణించారు. జమీందార్లను ఎదిరించిన రైతులు చిన్నచిన్న కమతాలను ఏర్పాటు చేసుకుంటారు. కాని పెట్టుబడి వాదులు పంజా విసిరి రైతుల్ని కొల్లగొడతారు. బాల్జాక్ స్వయంగా అభ్యుదయవాది కాకపోయినా ఆయన రచనల్లో వాస్తవికతావాదం చోటుచేసుకుంది. "యూరపులో వాస్తవికతా వాదం- ఒక అధ్యయనం" అనే ఈ గ్రంథంలో గమనించాల్సిన మరో అంశం ఉంది. అదేమిటంటే మార్క్సవాదాన్ని ఆధునికతావాదులు ఇదంతా కాలం చెల్లిన భావజాలం. ఇది అభిలషణీయం కాని 19వ శతాబ్ది వారసత్వం" అని కొట్టి పారేస్తారు. ఉద్దేశ పూర్వకంగానో, ఉద్దేశరహితం గానో, సచేతనంగానో అచేతనంగానో వీరు ఫాసిస్టు భావజాలాన్ని-అంటే సంస్కృతినీ మానవతా వాదాన్నీ తిరస్కరించే ఫాసిస్టు భావజాలాన్ని సమర్థిస్తారు అని లూకాచ్ స్పష్టం చేస్తాడు.

లూకాచ్‌ను గురించిన ఒక అపోహ ఉంది. అతడు కవిత్వాన్ని తక్కువ చేసి చూసేవాడని. ఇది తప్పు అని ప్రొఫెసర్ నామ్‌వర్‌సింగ్ స్పష్టం చేస్తాడు. కవిత్వాన్ని గురించి లూకాచ్ ఎలా భావిస్తాడో అతని మాటల్లోనే- "పొయెట్రీ ఈజ్ ది మదర్ టంగ్ ఆఫ్ మ్యాన్ కైండ్" కవిత్వం "మానవ జాతి మాతృభాష." లూకాచ్ వస్తువుకూ రూపానికీ సమాన ప్రాధాన్యం ఇస్తాడు. కాని అతడు రూపవాది కాడు, రూపాన్ని సామాజిక అంశంగా పరిగణిస్తాడు. నిజంగానే రూపం సామాజిక సారాన్ని ప్రతిబింబిస్తుంది. పద్యాలు రాచరిక యుగానికి సామంతవాదానికి చెందినవే. ఆధునిక యుగానికి చెందిన రూపంకాదు అది. 'నవలా సిద్ధాంతం' (1915) అనే తన గ్రంథంలో లూకాచ్ మహాకావ్యం స్థానంలో ఆధునిక యుగంలో నవల వచ్చింది అని అంటాడు. మహా కావ్యం జీవిత సంపూర్ణత్వానికి రూపం ఇస్తుంది. నవల దాగివున్న జీవిత సంపూర్ణత్వాన్ని వెలువరిస్తుంది. నవలలో వాస్తవికత ఆవిష్కరిస్తారు. నవలా రచనలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. స్వాభావికంగా నవల గేయాత్మకతనూ, నాటకీయతనూ సంతరించుకునే ప్రమాదం ఉంది. వాస్తవికతను కుదింపచేసి వర్ణనలకు ప్రాధాన్యం ఇస్తే ఆ నవల కాలక్షేప నవలగా మిగిలిపోతుంది. నవలను ఆయన 'అర్ధకళ' గా భావిస్తారు. అర్ధ కళ అయినా నవల కొన్ని కఠినమైన కళా నియమాల్ని పాటించవలసి ఉంటుందని అంటాడు. నవలలో నైతికాంశం ప్రతి ఘట్టంలోను దృశ్యమానమవుతూ ఉంటుంది. ప్రతి ఘట్టానికీ రచయిత స్వీయాత్మక ప్రతిచర్యను వ్యక్తీకరిస్తూ పోతే అది పాఠకుల్ని అలరించగలదేమో కాని, ఆ రచన గంభీర పాఠకున్ని ఆకట్టుకోలేదు. నగిషీలు రచనకు పనికిరావు. నవలా రచయిత రచన పట్ల నిర్మమంగా ఉండాలి. అపుడే మనిషి యొక్క పరాయీకరణ వ్యక్తం కాగలదు.

గియోర్గి లూకాచ్ రాసిన 'సౌందర్య శాస్త్రం' ఉద్గ్రంథం ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చింది. మొదట 1911-12 శీతాకాలంలో ఫ్లోరెన్స్ పట్టణంలో ఓ స్వతంత్ర సమగ్ర సౌందర్య శాస్త్రం రాయాలని అనుకొన్నాడట. ఐడెల్‌బర్గ్ 1912- 14 మధ్య దీనిపై కొంత కృషి చేశాడు. కాని ఆ ప్రయత్నం ఫలించలేదు. 1930 లో ఓ ప్రణాళికా బద్ధమైన సౌందర్య శాస్త్రం రాయాలనేది ఒక యోచనగా మాత్రమే మిగిలింది. రెండు దశాబ్దాల తర్వాత, అంటే 50 వ దశాబ్దంలో ఆ కల నెరవేరింది. హంగేరియన్ భాషలో రాసిన ఈ గ్రంథం మన భాషల్లోకి ఇంకా అనువాదం కాలేదు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన గియోర్గి లూకాచ్‌కు మన దేశంలో రావాల్సినంత గుర్తింపు రాలేదేమో.

భ్రమాత్మక భావం

తాడులేని బొంగరం గిరగిరా
తలలో తిరుగుతుంటుంది
నేలవిడిచి నిచ్చెన ఆకాశంలో
నిటారుగా నిలిచుంటుంది
ఊహల ప్రపంచం కళ్లలో
ఉన్నతంగా వెలుగుతుంటుంది.

పునాది లేకుండా ఇల్లు
విత్తనం లేకుండా చెట్టు
వీర్యం,అండం లేకుండా మనిషి
రెక్కలు లేకుండా ఎగిరే పక్షి
విస్తారంగా శూన్యంలో
వింత సృష్టి జరుగుతుంటుంది.

అందమైన చీరమీది అద్దాల్లా
నింగిలోని చుక్కలన్నినేల దిగి
నర్తిస్తూ కవ్విస్తుంటాయి
చందమామ భువికి దిగి
సయ్యాటలాడుతుంటాడు
ఆకలి దప్పులు అలసట లేని
అంగాంగ సింగారాలు
రతీ మన్మథ రసానందాలు
రాజ్యమేలుతుంటాయి.

ఉదయించే సూర్యుడు
ఉరిదీయబడుతాడు
గ్రహకూటమి గతి తప్పి
గాయి గాయి అవుతుంటుంది
గాలి స్థంభించి మాయమై పోతుంటుంది
ఐనా భూమి మీద వెలుగు
ఆ వెలుగులో జీవరాశి విస్తరిస్తూనే ఉంటుంది
కాలం గడియారం బ్యాట్రీ లేకపోయినా
నిరంతరం కదులుతూనే ఉంటుంది.

చారిమినార్ వైజాగ్‌లో
చక్కగా ఆకర్షిస్తుంటుంది
హైదరాబాద్ ఆరు బైట
అందమైన బీచ్ వెలుస్తుంటుంది
ఆగ్రాలోని తాజ్‌మహల్ బెంగుళూరులో
అపురూపంగా దర్శనమిస్తుంటుంది
రాజస్తాన్ ఎడారి అంతటా పచ్చికబయల్లు
పరిహాసమాడుతుంటాయి
దక్షిణాన హిందూ మహాసముద్రానికి
కరకట్టగా హిమాలయాలు నిలుస్తుంటాయి
లేనివి ఉన్నట్లు ఉన్నవి లేనట్లు
లెక్కతప్పి కనిపిస్తుంటాయి.

బతుకుపోరాటంలో
శ్రమజీవి చెమట చుక్కలు
సమస్యల సుడిగుండంలో
బాధల కన్నీటి ఊటలు
చెరబడ్డ చెరచబడ్డ
సమాజ గాయాలు
మత మూఢత్వం మారణహోమాలు
చెలరేగే హింసా ధ్వంసాలు
ధనస్వామ్యం దారిద్ర్యం
అంతరాల అభివృద్ధి
ఉప్పొంగె సముద్రాలు
ఉరికే నదీ ప్రవాహాలు
ప్రశ్నించే గొంతుకలు
ప్రజాస్వామ్య హక్కులు
వాస్తవావర్తనాలు
అవాస్తవాలై పోతుంటాయి

ఎండాకాలం చలిగా
చలికాలం ఎండగా
ఋతువుల క్లోనింగ్ జరిగి
కృత్రిమ వసంతం కాంతిహీనంగా
కన్నీరు పెడుతుంటుంది.

అక్షరాలు పదాలుగా అభూత కల్పనలై
అందమైన కవితా పుష్పాలుగా
అద్యంతం విరబూస్తుంటాయి
పరిమళంలేక కృతకంగా షోకేసులో బొమ్మల్లా
సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంటాయి
భ్రమాత్మక భావం ప్రతిబింబాలుగా
వాస్తవికతా వక్రీభవనాలై
మనుషులను అచేతనులుగా
భ్రష్టు పట్టిస్తుంటాయి.

-వేల్పుల నారాయణ, 9440433475

ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం

కవితాసంపుటాలకు ఆహ్వానం

అరసం వరంగల్ వారు ప్రతి సంవత్సరం ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేయుట మీకు తెలిసిందే. 2022 సంవత్సరానికిగాను కవిత్వానికి ప్రదానంచేయుటకు సంకల్పించి కవులనుండి కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నాం.

నిబంధనలు:

- ✦ సంపుటాలు మాత్రమే పంపాలి. సంకలనాలు (collections) స్వీకరించబడవు. వచన, గేయ కవితాసంపుటాలు, దీర్ఘకవితలు పంపవచ్చు.
- ✦ 2018 జూలై నుండి 2022 జూన్ వరకు ప్రచురించినవై ఉండాలి.
- ✦ మొదటి ముద్రణలు మాత్రమే పంపాలి.
- ✦ నాలుగు ప్రతులు పంపాలి. **ప్రతులు చేరవలసిన చివరితేది 31 ఆగస్టు 2022.**

ఎంపికైన గ్రంథకర్తకు అక్టోబర్ 2022లో హనుమకొండలో జరుగు ప్రత్యేక కార్యక్రమంలో రూ.5000/-నగదు, శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం చేయబడును.

పుస్తకాలు పంపవలసిన చిరునామా: చందనాల సుమిత్ర, ఇంటి నెంబర్, 5-11-902, హనుమాన్ నగర్, పెగడపల్లిక్రాస్‌రోడ్, హనుమకొండ-506009

కవులు సకాలంలో వారి పుస్తకాలు పంపవలసినదిగా అరసం వరంగల్ అధ్యక్షులు నిధి, ప్రధాన కార్యదర్శి పల్లేరు వీరస్వామి ఒక ప్రకటనలో కోరుతున్నారు. ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు- **9701000306, 9441602605, 9550217802**

సేవాగుణానికి స్ఫూర్తి ప్రతీక 'స్పర్శవేది'

గ్రంథ సమీక్ష

అవసరంలో ఉన్నప్పుడు మనకు ఎవరో ఒకరు సాయం చేస్తారు. వాళ్ళను దేవుడులా భావించి కృతజ్ఞతలు తెలియజేస్తాం. సాయం చేసిన వాడెప్పుడూ సాయం పొందినవాడి ముందు దేవుడే. మనకేమాత్రం సంబంధం లేని ఒకరు ఎందుకలా సాయం చేశారో ఆలోచిస్తే ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి. కొన్నింటిని కొలతల్లో చెప్పినట్లు 'సాయం'ను కొలతల్లో చెప్పలేం. అది చిన్న సాయమో, పెద్ద సాయమో తీర్మానించలేం. దాని గొప్పదనాన్ని సాయం పొందినవాడు నిర్వచిస్తాడు. 'దైవం మానుష రూపేణ' అన్నారు పెద్దలు. అంటే దైవం ఎక్కడో లేదు, 'మనిషి' రూపంలో మన దగ్గరే ఉందని అర్థం. సాయం పొందినప్పుడు మనకు వారి సాక్షాత్కారం లభిస్తుంది.

సేవకు అవకాశం కల్పించిన భగవత్ స్వరూపం - అతిథి. సేవ ద్వారానే మన జీవితం ప్రస్ఫుటమవుతుంది. ఎవరికైనా సేవచేసే అవకాశం లభిస్తే సాక్షాత్తు ఆ భగవంతుడికి సేవ చేస్తున్నట్లే భావించమంటారు. ఆ సేవాతత్వం అక్షరాల రూపంలో కాగితాల నిండా పరచుకున్న కథాసంపుటి ఈ 'స్పర్శవేది'. వృత్తిరీత్యా సేవకు అంకితమైన వ్యక్తి ఎమ్వీ రామిరెడ్డి. తన జీవితాన్ని సేవకు అర్పించాలనే సత్సంకల్పంతో దాన్నే వృత్తిగా ఎంచుకున్నారేమో అనిపిస్తుంది. మనచుట్టూ ఉన్న సమాజంలో మంచి కన్నా చెడు ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. మంచిగా మారడానికి కొన్నేళ్ళు పట్టొచ్చేమో గానీ చెడుగా మార్పు చెందడానికి క్షణం చాలు. అటువంటి పరిస్థుతుల మధ్య మంచినే నమ్ముకుని, సేవనే దైవంగా భావిస్తూ, దాని గురించి నలుగురికీ తెలియజేయాలన్న ఆశయంతో సేవకు సంబంధించిన కథలన్నీ సంపుటిగా తీసుకొచ్చారు.

రామిరెడ్డి కథల్లో బాగా నచ్చే అంశం-కథలోని కాన్వాస్. దాన్ని చాలా షార్ట్ గా చెప్తారు. స్వీట్‌గా అనిపిస్తుంది. పాత్రికేయ నేపథ్యం ఉండటంతో పాఠకులను ఆకర్షించేలా రచన చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. 'స్పర్శవేది' లో మొత్తం పదహారు జీవితాలు మనలోని సేవాగుణాన్ని ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నాయి.

'మాధవసేవ' కథ చదవడం మొదలు పెడితే అందులోకి పరకాయ ప్రవేశం చేయడం ఖాయం. అంత సాఫీగా చదివిస్తుంది. హృదయాన్ని తడి చేస్తుంది. లోపలెక్కడో దాగున్న మానవత్వాన్ని గుర్తుచేస్తుంది. జేకేఆర్ దగ్గర మాధవయ్య ప్రవర్తన హుందాగా ఉంటుంది. మనలో చాలామంది మాధవయ్యలు ఉంటారు. ఈరోజుల్లో అంతలా అర్థం చేసుకుని మసలుకునేవారు తక్కువ. మాధవయ్య, జేకేఆర్ పాత్రలు మానవీయతకు నిదర్శనంగా ఉన్నాయి. హిందీ శీర్షికతో ఉన్న 'కుఛ్ తో హై'కథ ఎవరి ఆలోచనలకూ అందదు. వేశ్యల గురించి కథలంటే వాళ్ళ కష్టాలో, కన్నీళ్ళో నేపథ్యాలుగా వచ్చినవే ఇంతవరకూ చదివాము. ఇది అంతకు మించి... వాళ్ళల్లో ఉన్న పోరాటాన్ని చూపింది. బాలాజీ లాంటివాళ్ళు అరుదు. సరోజ ప్రయోగంతో వీరబాబు తిక్క ఎలా కుదిరిందో కథ చదవాల్సిందే. వనజ లాంటివాళ్ళను ఆటబొమ్మలుగా చూసే వీరబాబు లాంటివాళ్ళకు అలాగే జరగాలి అనిపించడం సహజం. అలాంటివారి ఆలోచనా ధోరణిని మారాలి. మార్చాలి. మారేలా చేయాలి. దానికి నడుం బిగించాలి. 'ప్రియురాలి మొహంపై యాసిడ్ దాడి' అనే వార్తను చదివినప్పుడల్లా బాధ నిలువెల్లా ఆవహిస్తుంది. 'పాపం వారి పరిస్థితి ఏమిటి?' అనుకుంటాం. ఎప్పుడూ అలా అనుకోవడమేనా... కాదని రచయిత 'యాసిడ్ టెస్ట్'అనే కథను అమ్మాయి నేపథ్యంలో రాశారు. మొహం కాలిపోతే నిరాశ పడిపోయి జీవితాన్ని నాశనం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ, మన అభిమానాన్ని చంపుకోకుండా ఎంత హుందాగా బతకొచ్చో రేష్మ పాత్ర ద్వారా కళ్ళకు కట్టారు. అలాంటివారి మనసులో రగిలే మంటలే అక్షరాలుగా రూపు సంతరించు కున్నట్లు ఉంటుంది. స్త్రీ తన కాళ్ళ మీద తాను నిలబడినప్పుడు సమాజంలో మార్పు కచ్చితంగా వస్తుందని చెప్తుంది ఈ కథ.

చారిత్రక కథలు చదివినప్పుడు 'మన చరిత్ర ఇలా ఉండేదట..', జానపద కథలు చదివినప్పుడు 'రాజులు, రాజ్యాలు ఇలా ఉండేవట..', వరకట్నం, వితంతు బాల్య వివాహాల మీద కథలు చదివినప్పుడు 'ఇంత దారుణమా?' అని మనం ఎలాగైతే అనుకుంటామో కొన్నేళ్ల తర్వాత 'స్పర్శవేది'కథను చదివితే 'కరోనా వచ్చినప్పుడు జనం ఇలా ఉండేవారట, మనుషుల్ని దగ్గరికి రానిచ్చేవారు కాదట..' లాంటివి చెప్పుకుంటారు. కరోనా విజృంభణ నాటి పరిస్థితుల్ని ఈ కథలో బాగా చిత్రించారు. అంతటి విపత్కర పరిస్థితి ఎదురైనా మనిషికి మనిషి సాయం ఎలా చేసాడో చదివితే మనసు భారమవుతుంది.

'మరణానికి ఇవతలి గట్టు'అనేది కోవిడ్ టైంలో ఎంతోమంది అనుభవాలగుట్ట.. డబ్బే గొప్పదని నమ్మేవాళ్ళను సైతం మార్చిన ప్రకృతి బీభత్సం.. ప్రకృతితోనే, ప్రకృతిలోనే మమేకమవమని పరోక్షంగా హెచ్చరించిన వైనం... ఒక్కో సంఘటన చదువుతుంటే మనకే అలా జరుగుతుందేమో అనిపించి ఏడుపు వచ్చేస్తుంది. ఆయా సంఘటనల్ని అనుభవించిన వాళ్ళు చదివితే కన్నీటి గట్టు తెగడం ఖాయం. పొందికైన వాక్య నిర్మాణంతో, అక్కడక్కడా వచన కవిత్వాన్ని అలంకరించుకున్న సన్నివేశాల కూర్పు మనల్ని పట్టి లాక్కెళ్తుంది.

బ్యాట్స్‌మన్ సొంతగడ్డపై ఎందుకు ఎక్కువగా చెలరేగిపోతాడు అంటే ఆ పిచ్‌లోనే జీవితాన్ని వెతుక్కుంటాడు కాబట్టి. ఏ పనైనా పంతంతో చేయకూడదు. పనితనంతో చేయాలి. పంతం పట్టేముందు ఉదయ్ కూడా అదే ఆలోచించి ఉంటే ఆత్మహత్య వరకు వెళ్లి ఉండేవాడు కాదు. ఈ సంపుటిలో అన్ని కథలతో పాటు ఓ మెట్టు అమితంగా మనల్ని సంతృప్తి పరిచే కథ 'నాగలి గాయాల వెనక'. ఈ కథ చదువుతుంటే మన తండ్రో, తాతో గుర్తుకొస్తూనే ఉంటారు. మార్కెట్ యార్డులో జరిగే మోసాల్ని చూసి కూడా ఏమీ చేయలేని మన నిస్సహాయత గుర్తుకొస్తుంది.

మనిషిని మార్చేది ఏమిటని ఒక్కోసారి అనిపిస్తూ ఉంటుంది. డబ్బు అనుకుంటాము, పలుకుబడి అనుకుంటాము, ప్రేమ అనుకుంటాము. కానీ, 'సంకెళ్ళు తప్ప' అనే కథ చదివితే మరో శక్తి ఏమిటో తెలుస్తుంది. అదే తెగింపు... కొన్ని అనివార్య పరిస్థితుల్లో తెగింపు మనిషిని పూర్తిగా మార్చేస్తుంది. తన బిడ్డలకు ఏమైనా జరుగుతుంది అంటే పిల్లి కూడా పులిమీద తిరగబడుతుంది. ఆ తెగింపే చంద్రయ్యలో కలిగింది. అతనికో దారి చూపింది. ఈ కథలో పిల్లాడు టింకూ పాత్ర కథను మలుపు తిప్పే, చంద్రయ్యకు దారి చూపే పాత్ర. అటువంటి పాత్రలను సృష్టించడం రామిరెడ్డికి బాగా అలవాటైన విద్య. కథ చదువుతున్నంతసేపు చంద్రయ్య నిర్ణయం ఏమై ఉంటుందా? అన్న ఉత్కంఠ మనల్ని కథ వెంట పరుగులు పెట్టిస్తుంది.

మన ఇంట్లోనో, పక్కింట్లోనో, బంధువుల ఇంట్లోనో జరిగిన కథే 'చీపురు పుల్ల'. పిల్లలకు డెంగూ జ్వరం వచ్చినప్పుడు, ఆర్థికంగా వెనకబడినవాళ్ళు పడే నరకయాతన ఎలా ఉంటుందో కళ్ళకు కట్టారు రచయిత. హాస్పటల్ సీన్స్ చదువుతుంటే భయం వేస్తుంది. ప్లేట్‌లెట్స్ విలువేంటో మనకు తెలియజేశారు రచయిత. నాగరాజులాగా సాయం చేసేవాళ్ళు ఉండబట్టే ఆర్థికంగా వెనకబడినవాళ్ళు జీవనం సాగించగలుగుతున్నారు. లేదంటే... ఊహించుకోవడానికే కష్టంగా ఉంటుంది. జంగమ్మ సేవా దృక్పథాన్ని చదివి తీరాల్సిందే. మన చుట్టుపక్కల్లో ఒకరు గుర్తుకొస్తారు.

ఎన్నిసార్లు చదివినా ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చే కథ 'కురుక్షేత్రం. గుండు చేయించుకున్నాక మూడు నెలల్లోనే పూర్వ వైభవం సంతరించుకునే జుట్టును దానం చేయడాన్ని మగవాళ్ళు ఘనకార్యంగా భావించకపోవచ్చు. పట్టించుకోకపోవచ్చు. ఆడవాళ్ళకు అలా కాదు. వాళ్ళ అందం, ఆత్మవిశ్వాసం అందులోనే ఉందని నమ్ముతారు. దానికి లోటు రానివ్వకుండా చూసుకుంటారు. ఒక్క తెల్ల వెంట్రుక వచ్చినా వెంటనే రంగు వేసేస్తారు. ఒక్క అంగుళం జుట్టు తక్కువగా ఉన్నా తమ అందానికి ఏదో లోటు అని మథనపడే స్త్రీలు, అలా తమ జుట్టును సేవా కార్యక్రమానికి ఇవ్వడం చాలా గొప్ప విషయం. కేన్సర్ పేషంట్స్‌కు జుట్టును దానంచేస్తే లభించే సంతృప్తి ఎలాంటిదో కృష్ణవేణి పాత్ర తెలియజేస్తుంది. 'హెయిర్ ఫర్ హోప్' అనే సంస్థ గురించి విపులంగా తెలుసుకుంటాము. సాయం చేయడానికి మనమూ ముందుకొస్తాము. 'నిజమైన శ్రీమంతులు ఎవరు?' అంటే కలలు రాకుండా నిద్రపోగలిగినవారు, తృప్తిగా జీవనం సాగించగలిగినవారు... అది తెలియక ఎంతోమంది వేటి వెంటో పడుతుంటారు. ఎంత సంపాదించినా తృప్తి కలిగే మార్గం తెలీక మథన పడుతుంటారు. అలాంటివారికి కనువిప్పు కలిగించే కథ 'శ్రీమంతులు'. ఈ కథను చదివినట్లయితే వారికో మార్గం దొరికినట్లే.

ఈ సంపుటిలో అన్ని కథలూ సేవ ప్రధానంగా ఉంటాయి. జీవితాన్ని అనుభవించిన వారి, దగ్గరగా చూసిన వారి రచనలు వాస్తవికతకు అద్దం పడతాయి. ఎమ్వీ రామిరెడ్డివి అనుభవపూర్వకమైన కథలు. అందులో జీవం ఉంటుంది. ఓ రకమైన ప్రేమ ఉంటుంది. కథలోని పాత్రలతో మమేకమవుతారు. ఆశావాద దృక్పథాన్ని కలిగిస్తారు.

దొండపాటి కృష్ణ, 9052326864

బీహార్ భూగర్భ జలాల్లో యురేనియం గరళం

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

అధికారుల్లో ఆందోళన

పాట్నా: బీహార్ భూగర్భ జలాల్లో యురేనియం గరళం అధికమవుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం గుర్తించింది. నలంద, నవాడ, కతిహార్, మాధేపురా, వైశాలి, సుపాల్, ఔరంగాబాద్, గయా, సరన్, జెహనాబాద్, భభువా, ఖగారియా, షేక్‌పురా, పూర్నియా, కిషన్‌గంజ్, బెగుసరాయ్ జిల్లాల్లో భూగర్భజలాలు యురేనియంతో తీవ్రంగా కలుషితమవుతున్నాయని అధికారులు తెలిపారు.

ఈ విషయంపై శాస్త్రీయ పరిశోధనల కోసం పది జిల్లాల నుంచి భూగర్భజలాల నమూనాలను సేకరించి లక్నోలోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు (సీజీడబ్ల్యూబీ)కి పంపినట్టు సీజీడబ్ల్యూబీ మిడిల్ ఈస్టు రీజినల్ డైరెక్టర్ ఠాకూర్ బ్రహ్మానంద్ సింగ్ అన్నారు. తాగే నీటిలో యురేనియం ఉండడం ప్రజారోగ్యానికి సంబంధించి ఆందోళన కలిగించే విషయమని ఆయన తెలిపారు. భూగర్భజలాల నమూనాలను సేకరించి యురేనియం తీవ్రతపై ఇండక్టివ్లీ కపుల్డ్ ప్లాస్మా మాస్ స్పెక్ట్రోమెట్రీ పద్ధతిలో పరిశోధనలు జరపనున్నట్టు పేర్కొన్నారు. సీజీడబ్ల్యూబీ నివేదిక వచ్చిన అనంతరం చేపట్టవలసిన కార్యాచరణను నిర్ణయిస్తామని పేర్కొన్నారు. మరోవైపు సీజీడబ్ల్యూబీ ప్రాంతీయ విభాగం, రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్య విభాగం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థలు సంయుక్తంగా రాష్ట్రంలోని భూగర్భ జలాల్లోని యురేనియం సాంద్రతను అంచనా వేయడానికి, ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయని వివరించారు. నీటిలో యురేనియంపై గతంలో జరిపిన అధ్యయనాల ఆధారంగా చూస్తే ప్రస్తుతం యురేనియం సాంద్రత పెరిగిందని భావిస్తున్నట్టు తెలిపారు. తాగునీటి విషయంలో యురేనియం స్థాయిలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ ఎటువంటి కచ్చితమైన ప్రమాణాలను నిర్దేశించలేదని పేర్కొన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మాత్రం లీటరు తాగునీటిలో 30 మిల్లీ లీటర్ల యురేనియం వరకూ ప్రమాదం కాదని నిర్దేశించినట్టు తెలిపారు. 2019-20లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని భూగర్భజలాల్లో యురేనియం స్థాయిని అంచనా వేయడం కోసం సీజీడబ్ల్యూబీ 14,377 నమూనాలు సేకరించి పరిశోధించినట్టు తెలిపారు. ఇందులో బీహార్ నుంచి 634 నీటి నమూనాలను పరిశీలించగా అందులో 11 నమూనాల్లో మాత్రం యురేనియం సాంద్రత చాలా అధికంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ విషయంపై రాష్ట్ర కాలుష్యమండలి చైర్మన్ అశోక్ కుమార్ ఘోశ్ స్పందించారు. రాష్ట్ర కాలుష్యమండలి జరిపిన అధ్యయనాల్లోనూ భూగర్భ జలాల్లో యురేనియం తీవ్రత పెరిగినట్టు తేలిందని చెప్పారు. భూగర్భ జలాల్లో యురేనియం అధికమవుతుండడం ఆందోళనకరమని చెప్పారు. యురేనియం కలిసిన నీరు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని పేర్కొన్నారు. తాగునీటిలో యురేనియం మోతాదుకు మించి ఉంటే ఎముకలకు సంబంధించిన వ్యాధులతో సహా మూత్రపిండాల పనితీరును ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్ బారిన పడే ప్రమాదం అధికమని చెప్పారు.

కరుణానిధికి ఘన నివాళి

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయనకు డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, సీనియర్ నాయకులు దయానిధి మారన్, కె.కనిమొళి, రాష్ట్ర మంత్రులు ఘనంగా నివాళులర్పించారు. తొలుత ఇక్కడి కామరాజ్ సలైలోని కరుణానిధి స్మారక స్థూపం వద్దకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఏడాది మేలో చెన్నైలోని ఓమందురార్ ప్రభుత్వ ఎస్టేట్‌లో నెలకొల్పిన కరుణానిధి విగ్రహానికి స్టాలిన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చేనేత దేశ సాంస్కృతిక వారసత్వం: అమిత్ షా

న్యూఢిల్లీ : భారత చేనేత రంగం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక సందేశాన్ని విడుదల చేశారు. దేశ ప్రజలంతా చేనేత వారసత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా మహిళా నేత కార్మికులకు సాధికారత కల్పించాలని కోరారు. 1905 ఆగస్టు 7న లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా 2015లో ప్రధాని మోదీ ఈ రోజును జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని గుర్తు చేశారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను దేశ ప్రజలంతా ప్రోత్సహించడమే ఎనిమిదవ జాతీయ చేనేత దినోత్సవం లక్ష్యం కావాలని, ఈ విషయంలో దేశ ప్రజలంతా చేతులు కలుపుదామని పిలుపునిచ్చారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

కోల్‌కతా : పశ్చిమబెంగాల్, సిక్కిం, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని పోస్టాఫీసుల్లో త్రివర్ణ పతాకాలను విక్రయిస్తున్నట్టు తపాలాశాఖ అధికారులు తెలిపారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ అమృతోత్సవాల్లో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు దేశ ప్రజలంతా తమ నివాసాలపై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించాలని 'హర్ ఘర్ తిరంగ' పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోస్టాఫీసుల్లో జాతీయ జెండాను నామమాత్రపు ధరకు విక్రయిస్తున్నట్టు తపాలాశాఖ అధికారి ఒకరు తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఆగస్టు 1 నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించగా ఇప్పటిరి 90 వేల జాతీయ పతాకాలట అమ్ముడయ్యాయని తెలిపారు.

త్వరలో షిండే మంత్రివర్గ విస్తరణ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే త్వరలోనే మంత్రివర్గాన్ని విస్తరించనున్నారు. దాదాపు 15మంది మంత్రులను కేబినెట్‌లో చేర్చుకోబోతున్నారని, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు కీలక హోంశాఖను కొనసాగించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా సుప్రీంకోర్టులో ఓబీసీ రిజర్వేషన్లపై విచారణ జరుగుతున్నందున రాష్ట్రంలో ఆలస్యమైన స్థానిక ఎన్నికలు... అత్యున్నత న్యాయస్థానం నుంచి స్పష్టత వచ్చాక అక్టోబరులో జరిగే అవకాశం ఉందని కూడా పేర్కొన్నాయి. శివసేన ఎమ్మెల్యేల తిరుగుబాటు కారణంగా ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేయడంతో జూన్ 30న ముఖ్యమంత్రిగా షిండే, ఉప ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచే ఈ ఇద్దరే మంత్రివర్గంగా ఉంటూ పాలన సాగిస్తున్నారు. దీనిపై ఎన్‌సిపి నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో సహా ప్రతిపక్ష నాయకులు విమర్శలు ఎక్కుపెట్టారు.

ధన్కర్‌కు గెలుపు ధృవీకరణ పత్రం పంపిన ఈసీ

న్యూఢిల్లీ : భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన జగదీప్ ధన్కర్‌కు భారత ఎన్నికల సంఘం ఆదివారం ధృవీకరణ పత్రాన్ని జారీ చేసింది. ఎన్‌డీఏ అభ్యర్థిగా బరిలోనిలిచిన ధన్కర్ 74.36 శాతం ఓట్లతో 14వ భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ సంతకంతో ధన్కర్ ఎన్నికను ధృవీకరిస్తూ రూపొందించిన సర్టిఫికేట్‌ను సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ కేంద్ర హోంశాఖ సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ నరేంద్ర బుటోలియాకు అందించారు. ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా ఉన్న వెంకయ్యనాయుడు ఈ నెల 10 న పదవీ విరమణ చేయనుండడంతో 11న నూతన ఉపరాష్ట్రపతిగా ధన్కర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

చరిత్రాత్మక లేడీ కీన్ కళాశాలకు...

రూ.45 లక్షల ఆస్తిపన్ను

షిల్లాంగ్: ఈశాన్య భారతదేశంలోని తొలి కళాశాలల్లో ఒకటైన మేఘాలయలోని లేడీ కీన్ కళాశాలకు మేఘాలయ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్ కంటోన్మెంట్ బోర్డు రూ.45 లక్షల ఆస్తిపన్ను విధిస్తూ తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1935లో రాష్ట్రంలో ఏర్పాటైన ఈ తొలి కళాశాల స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగించడంలో, మహిళల అభ్యున్నతికి, సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన సంస్థగా గుర్తింపుపొందింది. అయితే ప్రస్తుతం నార్త్-ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఈ కళాశాల రక్షణ రంగానికి చెందిన భూమిలో ఉన్న కారణంగా కంటోన్మెంట్ బోర్డు సర్వీస్ నిబంధనల ప్రకారం రూ. 45,25,956లు చెల్లించాలని కోరినట్టు ఆ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్ రజక్ తెలిపారు. కంటోన్మెంట్ చట్టం -2006 సెక్షన్ 109 ప్రకారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో ఆస్తులు కలిగి ఉన్నవారు ఏటా చట్టబద్ధమైన పన్నులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన లేడీ కీన్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఖ్లార్ ముఖిమ్ మాట్లాడుతూ...ఆస్తిపన్ను చెల్లించాలని వచ్చిన నోటసు తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. బ్రిటీష్ కాలంలోనే ఏర్పాటైన ఈ కళాశాల చరిత్ర చాలా ఘనమైందని చెప్పారు. కళాశాల యాజమాన్యం తరపున ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

దేశంలో అతిపెద్ద మసీదు తాజ్ ఉల్ మసాజిద్

జమా మసీదు కాదు: తేల్చేసిన చరిత్రకారులు

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో ఉన్న జమా మసీదు దేశంలో అతిపెద్ద మసీదు కాదని చరిత్రకారులు తేల్చారు. ఢిల్లీ పర్యాటక వెబ్‌సైట్, నగరంలోని హోర్డింగులు పేర్కొన్నట్లుగా జమా మసీదు దేశంలోనే పెద్దది కాదని, ఆ స్థానం భోపాల్‌లోని తాజ్ ఉల్ మసాజిద్‌కు దక్కుతుందని తెలిపారు. ఢిల్లీ జమామసీదుకు చాలా ప్రాముఖ్యత ఉంది. దీనిని 1656లో మొఘల్ చక్రవర్తి షాజహాన్ నిర్మించారు. తాజ్ ఉల్ మసాజిద్ (మసీదుల కిరీటం అని అర్థం)ను 1868-1901లో భోపాల్‌కు మూడవ మహిళా పాలకురాలు షాజహాన్ బేగం నిర్మించారు. పాలరాతి గోపురంతో కూడిన జమా మసీదు దేశంలోనే అతి పెద్దదిగా ప్రాచుర్యం పొందింది.

జమా మసీదు ఓ కళాఖండం. మొఘల్ నిర్మాణశైలికిగాను ప్రాచుర్యం పొందింది. జమా మసీదు డిజైన్ ద్వారా స్ఫూర్తి పొంది అనేక నిర్మాణాలు జరిగాయి. తాజ్ ఉల్ మసాజిద్‌తో పాటు మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ నిర్మించిన బాద్‌షాహీ మసీదు (లాహోర్‌లో ఉంది) డిజైన్ కూడా జమా మసీదును పోలి ఉంటుందని ఢిల్లీ హెరిటేజ్ వాక్స్ విత్ సొహేయిల్ హాష్మీ అనే ఖాతా ద్వారా ఈ పోస్టు చేశారు. ఈయనకు 14వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. హాష్మీ చెప్పినదాంతో తాజ్ ఉల్ మసాజిద్. దరుల్ ఉలూమ్‌కు చెందిన ప్రొఫెసర్ హసన్ ఖాన్ ఏకీభవించారు. భారత్‌లోనే కాదు తాజ్ ఉల్ మసాజిద్ ప్రపంచంలోనే పెద్దది అని అన్నారు. ఖాళీ స్థలంతో పాటు నిర్మాణ ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకుంటే లాహోర్ బాద్‌షాహీ మసీదు పెద్దదని, ఔరంగజేబ్ 1670లో దీనిని నిర్మించారన్నారు. ఈ వాదనలను ధ్రువీకరించేలా కొలతలు అందుబాటులో లేనప్పటికీ కల్చర్ ట్రిప్ అండ్ హెలో ట్రావెల్ ప్రకారం 19వ శతాబ్దపు తాజ్ ఉల్ మసాజిద్‌లో 1,75,000 మంది కూర్చునే వెసులుబాటు ఉన్నట్లు తెలుస్తోంది. బ్రిటానికా డాట్ కామ్ ప్రకారం జమామసీదు ప్రాంగణంలో 25వేల మంది పడతారు. మసీదు తూర్పు ద్వారం ఎదురుగా ఉన్న బహిరంగ ప్రాంగణం కనీసం 325 చదరపు అడుగులు (99 మీటర్లు) ఉంటుందని ఆ వెబ్‌సైట్ పేర్కొంది.

చమురు కంపెనీలకు నష్టాలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినప్పటికీ ఆమేరకు దేశీయంగా పెట్రోలు, డీజిల్ , రిటైల్ ధరలను పెంచకపోవడంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)లు భారీ నష్టాన్ని చవిచూశాయి. మూడు ఇంధన రిటైలర్ల స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌ల ప్రకారం... అంతర్జాతీయంగా చమురు ధరలకు అనుగుణంగా నాలుగు నెలలుగా పెట్రోల్, డీజిల్ ధరలను రోజువారీగా సవరించాల్సిన చమురు కంపెనీలు ఆమేరకు మార్చలేదు. దీంతో రూ.18,480 కోట్ల నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. సదరు కంపెనీలు ఖర్చుతో సమానంగా వంట గ్యాస్ రేట్లను కూడా మార్చలేదు. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి ఐఓసీ జూలై 29న రూ.1,995.3 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. శనివారం హెచ్‌పిసిఎల్ రూ. 10,196.94 కోట్లు, బీపీసీఎల్ రూ. 6,290.8 కోట్ల నష్టాన్ని నమోదు చేశాయి.

టార్మాక్‌పై స్పైస్‌జెట్ ప్రయాణీకుల నడక

డీజీసీఏ దర్యాప్తు

న్యూఢిల్లీ: స్పైస్‌జెట్‌కు చెందిన హైదరాబాద్-ఢిల్లీ విమానంలో బయలుదేరిన ప్రయాణికులు... నిబంధనలకు విరుద్ధంగా ఢిల్లీ విమానాశ్రయం టార్మాక్‌పై నడవాల్సి వచ్చింది. ఎందుకంటే వారిని టెర్మినల్‌కు తీసుకెళ్లడానికి ఎయిర్‌లైన్ సుమారు 45 నిమిషాల పాటు బస్సును ఏర్పాటు చేయలేకపోయింది. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) దర్యాప్తు చేస్తోందని సంబంధిత వర్గాలు ఆదివారం పీటీఐకి తెలిపాయి. అయితే కోచ్‌లు రావడంలో కొద్దిసేపు ఆలస్యమైందని, బస్సులు వచ్చిన తర్వాత నడక ప్రారంభించిన వారితో సహా ప్రయాణికులందరూ టార్మాక్ నుంచి టెర్మినల్ భవనం వరకు వాటిపై ప్రయాణించారని స్పైస్‌జెట్ తెలిపింది. 'మా సిబ్బంది పదే పదే చెప్పినా వినకుండా కొంతమంది ప్రయాణికులు టెర్మినల్ వైపు నడవడం ప్రారంభించారు. కోచ్‌లు వచ్చేసరికి వారు కొన్ని మీటర్లు కూడా నడవలేదు. నడవడం ప్రారంభించిన వారితో సహా ప్రయాణికులందరూ టెర్మినల్ భవనానికి కోచ్‌లపై ప్రయాణించారు' అని వివరించింది. ఢిల్లీ విమానాశ్రయం టార్మాక్ ప్రాంతంలో భద్రతా పరంగా ప్రమాదం ఉన్నందున ప్రయాణికులు నడవడానికి అనుమతించరు. వాహనాలకు మాత్రమే తారురోడ్డుపై గుర్తించిన మార్గం ఉంది. విమానయాన సంస్థలు ప్రయాణీకులను టెర్మినల్ నుంచి విమానం వద్దకు తీసుకెళ్లడానికి గుర్తించిన మార్గంలో బస్సులను నడుపుతాయి. ప్రస్తుతం డీజీసీఏ ఆదేశాల మేరకు స్పైస్‌జెట్...ప్రయాణికుల సంఖ్య 50 శాతానికి మించకుండా తన విమానాలను నడుపుతోంది.

మణిపూర్‌లో ఆందోళనలు ఉధృతం

ఐదు రోజులు మొబైల్ సేవలు బంద్

ఇంఫాల్: మణిపూర్‌లో గిరిజన విద్యార్థి సంఘాలు ఇచ్చిన ఆందోళనల పిలుపు నేపథ్యంలో రాష్ట్రం నిరసనలతో అట్టుడుకుతోంది. మణిపూర్‌లోని కొండ ప్రాంతాల్లో ఉన్న జిల్లాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రెండు సవరణ బిల్లులను వ్యతిరేకిస్తూ ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ మణిపూర్ (ఏటిఎస్‌యుఎం) ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే.

ఈ క్రమంలో విద్యార్థి సంఘాలు రెండు రోజుల కిందట రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇదే క్రమంలో శనివారం రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌ను చేరకుకున్న విద్యార్థులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో.. రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. 30 మందికి పైగా గిరిజన విద్యార్థులు గాయపడ్డారు. ఐదుగురు గిరిజన విద్యార్థులను అరెస్టు చేసిన పోలీసులు అరెస్టు చేయడం, వారిని 15 రోజుల పాటు జైలుకు తరలించడంతో ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి. విద్యార్థి నేతలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ ఏటీఎస్‌యూఎం జాతీయ రహదారుల నిర్బంధానికి పిలుపునివ్వడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఈ పిలుపును అందుకున్న యువత రోడ్లపైకి చేరుకున్న యువత వాహనాలకు నిప్పుపెట్టిన ఘటనలు వెలుగు చూశాయి. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం ఆందోళనలు తీవ్రం కాకుండా చర్యలు చేపట్టింది.

ఈ క్రమంలో మణిపూర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రానున్న ఐదు రోజుల పాటు మొబైల్ డేటా సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి హెచ్. జ్ఞాన్ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యో పెద్దమ్మ

91 ఏళ్ల వయసులో...

స్వశక్తితో టీ స్టాల్ నిర్వహణ

అలప్పుజ : వృద్ధాప్యం మీద పడిగా మొక్కవోని ధైర్యంతో 91 ఏళ్ల వయసున్న ఓ పెద్దమ్మ తన స్వశక్తితో టీ స్టాల్ నిర్వహిస్తూ అనేక మంది ప్రశంసలు పొందుతోంది. కేరళలోని అలప్పుజా జిల్లాలోని దేవికులంగర గ్రామంలోని నివాసం ఉంటున్న 91 ఏళ్ల వయసున్న తంగమ్మ అనే వృద్ధురాలు అదే గ్రామంలోనే టీ స్టాల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఉదయం 5 గంటలకే నిద్ర లేచి గ్రామంలో సేకరించిన స్వచ్ఛమైన పాలతో టీ తయారు చేసి విక్రయిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోంది. తనను పలకరించిన మీడియాతో తంగమ్మ పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. తాను నిర్వహించే టీ స్టాల్‌లో ప్యాకెట్ పాలను ఎట్టి పరిస్థితిలోనూ వినియోగించమని, స్వయంగా తామే సేకరించిన ఆవు పాలనే వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఉదయం వేళలో మాత్రమే టీ తయారు చేసి విక్రయిస్తున్నట్టు తెలిపారు. తన 68 ఏళ్ల వయసున్న కుమార్తె వసంతకుమారి సహాయం చేస్తుందని తెలిపారు. ఉదయం టీ సెషన్ అయిపోగానే అల్పాహారం తయారు చేస్తున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి వివిధ రకాల చిరుతిళ్లను తయారు చేస్తున్నట్టు తెలిపారు. తన కుటుంబ సభ్యులకు జరిగిన ఒక వాహన ప్రమాదంలో సర్వం కోల్పోయినట్టు తెలిపారు. గ్రామ పంచాయతి తమకు కొంత స్థలం కేటాయించిందని తెలిపారు.

ప్రస్తుతం అద్దె ఇంటిలో ఉంటూ టీ స్టాల్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోజు వారి వచ్చే ఆదాయాన్ని సరుకులు కొన్న షాపు యజమానికి చెల్లించి మిగిలిన సొమ్మును ఆదా చేస్తున్నట్టు తెలిపారు. పంచాయతి అధికారులు ఇచ్చిన స్థలం నివాసానికి, టీ స్టాల్‌కు సరిపోకపోవడంతో కొంత ఇబ్బంది ఉన్నా తన కష్టాన్ని చూసిన పంచాయతి సహకారం మరువ లేనిదని చెప్పారు. తనకు ప్రభుత్వం నుంచి రూ. 1,600 పింఛను అందుతోందని, ఆసొమ్ము మందులు కొనడానికి ఉపయోగిస్తున్నట్టు తెలిపారు.

గోవాలో చిన్న గణేశులకు డిమాండ్

- **మహారాష్ట్ర నుంచి పెరుగుతున్న వలసలు**
- **బుజ్జి విగ్రహాలంటే వారికి మక్కువ: తయారీదారులు**

పనాజీ: గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకొని ఈసారి చిన్నసైజు గణపతి విగ్రహాల కోసం డిమాండ్ పెరిగిందని గోవాలోని విగ్రహ తయారీదారులు చెబుతున్నారు. ఇక్కడ స్థిరపడిన మహారాష్ట్రీయుల సంఖ్య పెరగడమే ఇందుకు కారణమని వారంటున్నారు. గోవాలోని స్థానికులు సాధారణంగా సగటున రెండు అడుగుల సైజులో ఉండే గణపతి విగ్రహాలను ఎంపిక చేసుకుంటారని, ఇక్కడకు వచ్చి స్థిరపడిన మహారాష్ట్ర ప్రజలు ఒక అడుగు కంటే తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను కోరుకుంటారని విగ్రహ తయారీదారులు తెలిపారు. కరోనా వ్యాప్తి తర్వాత మహారాష్ట్ర, ప్రత్యేకించి ముంబై వాసులు గోవాలో స్థిరపడి, ఇంటి నుండి పని చేసుకుంటున్న ధోరణి పెరిగింది. ఇక మహారాష్ట్ర మాదిరి గోవాలో కూడా గణేశ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకునే సంప్రదాయం ఉంది. దీనిని ఇక్కడ 'చోవోత్' అని పిలుస్తారు. ఈ ఏడాది ఆగస్టు 31న ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. విగ్రహాల తయారీ కుటుంబానికి చెందిన కళాకారుడు రితేష్ చారి మాట్లాడుతూ... మహమ్మారి ముందు కాలంతో పోలిస్తే గత రెండేళ్లుగా చిన్న గణేశ్ విగ్రహాలకు డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. '10 అంగుళాల చిన్న విగ్రహాలకు డిమాండ్ పెరుగుతోంది. ఇది గతంలో ఎప్పుడూ చూడలేదు' అన్నారాయన. ఈ విగ్రహాలను కొనుగోలు చేసేవారు ఎక్కువగా మరాఠీ మాట్లాడేవారేనని, గోవా స్థానికులు కాదని చారి చెప్పారు. గోవా కుటుంబాలు సాధారణంగా రెండు అడుగుల లేదా అంతకంటే ఎక్కువ పరిమాణంలో ఉన్న విగ్రహాలను ఇష్టపడతాయన్నారు. ఉత్తర గోవాలోని మార్సెల్ గ్రామానికి చెందిన మరో విగ్రహాల తయారీదారు రమాకాంత్ అమోంకర్ మాట్లాడుతూ... 'పండుగ సమయంలో ఇంట్లో చిన్న గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించే సంప్రదాయం ముంబైలో ఉంది.. అయితే గోవాలోని విగ్రహాలు పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. గోవా అంతటా, ముఖ్యంగా పనాజీ, మార్గోవ్, పోండా, మపుసా వంటి పట్టణ ప్రాంతాల్లో చిన్న విగ్రహాలకు డిమాండ్ ఉంది' అని ఆయన తెలిపారు. కోవిడ్-19 సమయంలో చాలా కుటుంబాలు గోవాకు మారాయని, ముఖ్యంగా పదవీ విరమణ చేసినవారు ముంబై వంటి రద్దీగా ఉండే నగరానికి దూరంగా గోవాలో ఇల్లు కట్టుకోవడానికి ఇష్టపడుతున్నారని ఆయన చెప్పారు. చాలా కుటుంబాలు తమ పూర్వీకుల గ్రామాలకు వెళ్లడం మానేసి, గోవాలోని తమ ఇంటిలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవడానికి ఇష్టపడుతున్నారని, దీని కారణంగా వారు చిన్న విగ్రహాలను కొనుగోలు చేయడానికే ఇష్టపడతారని అమోంకర్ వివరించారు. చిన్న విగ్రహాలయితే నిమజ్జనం కోసం సులభంగా రవాణా చేయవచ్చని ఆయన చెప్పారు. వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్ అయిన రాజేంద్ర దేశ్‌పాండే మాట్లాడుతూ... 2020లో కోవిడ్ విజృంభించిన తర్వాత గోవాను తమ కొత్త ఆవాసంగా మార్చుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఇక్కడ తన కుటుంబ సభ్యులతో కలిసి చోవోత్‌ను జరుపుకోనున్న దేశ్‌పాండే, భూముల ధరలు తక్కువగా ఉండటం, ఇంటి నుంచి పని చేసే అవకాశం తన నివాసాన్ని ముంబై నుంచి గోవాకు మార్చేలా చేసిందని చెప్పారు. 'గోవాలో జీవితం చాలా ప్రశాంతంగా ఉంది. కోవిడ్-19 గరిష్ఠస్థాయికి చేరుకున్నప్పుడు మేము ఇక్కడికి మారాము. ఇప్పుడు ఇక్కడే శాశ్వతంగా స్థిరపడ్డాం' అన్నారు. గోవా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి రోహన్ ఖౌంటే మాట్లాడుతూ... ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పని చేసే గమ్యస్థానంగా రాష్ట్రాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు.